V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..

సోమవారం
08-07-2024


సంపుటి : 01 | సంచిక : 65 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## వెనక్కితగ్గని సర్కార్..

- గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల
- 1:50 నిష్పత్తిలోనే అభ్యర్థుల ఎంపిక
- వెబ్‌సైట్‌లో ఫైనల్ కీ




**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఫలితాలను టీజీపీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. గ్రూప్ 1 ఫలితాలతోపాటు మిగతా2లో...



ఆషాఢమాస
## బోనాల ఉత్సవాలు ఘనంగా

# ఘనంగా

గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలిబోనం..

ఏర్పాట్లు పూర్తి చేసిన తెలంగాణ ప్రభుత్వం



**విశ్వంభర, గోల్కొండ :**

ఆషాఢ మాస బోనాల పండుగకు గ్రేటర్ నగరం కళకళలాడుతోంది. గోల్కొండ కోటపై కొలువై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ అమ్మవారికి కుమ్మరులు తొలిబోనంను సమర్పించారు. దీంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం కాగా.. తెల్లవారు జాము నుంచే జగదాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకుంటున్నారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు గోల్కొండ బోనాల జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. మరోవైపు బోనాల ఉత్సవాల ఊరేగింపు ప్రారంభమైంది. డప్పువాయిద్యాలు, పోతరాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య కోలాహలంగా ఊరేగింపు సాగింది. లంగర్ హౌజ్ నుండి గోల్కొండ కోట మిగతా2లో...



# తగ్గేదేలే

## ఫిరాయింపులపై రేవంత్ దూకుడు

- ఇప్పటికి 13 మంది కాంగ్రెస్ గూటికి..
- అసెంబ్లీ సెషన్ నాటికి బీఆర్ఎస్ ఖాళీ
- ఆ ధైర్యంతోనే ఊపుమీదున్న సీఎం
- కేసీఆర్, కేటీఆర్ ఆవేదనను పట్టించుకోని జనం
- కేసీఆర్ వేలును ఆయన కంట్లోనే గుచ్చిన పీసీసీ చీఫ్

**విశ్వంభర, హైదరాబాద్:**

కోర్టులో విచారణ జరుగుతున్నా సరే రేవంత్ ఫిరాయింపులకు పాల్పడుతున్నారంటేనే అర్థమవుతోంది తన ధైర్యం. ఇందుకు రెండు కారణాలున్నట్లు తెలుస్తోంది. మొదటిది ఫిరాయింపుల విషయంలో కోర్టు జోక్యంచేసుకోదు. రెండోది కోర్టు ఒకవేళ జోక్యం చేసుకున్నా, ఫిరాయింపులు తప్పని చెప్పినా స్పీకర్ ఆ ఆదేశాలను, తీర్పులను లెక్కచేయాల్సిన అవసరంలేదు. అసెంబ్లీ పరిధిలోని అంశాలపై స్పీకర్ దే అంతిమ నిర్ణయమని గతంలో చాలాసార్లు స్పష్టమైంది. ఫిరాయింపులకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టు, తెలంగాణా హైకోర్టు చెప్పినా అప్పుడు మిగతా2లో...

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎన్నిరకాలుగా భయపెట్టాలని చూసినా, ఛాలెంజులు చేస్తున్నా, హైకోర్టులో కేసులు వేసినా సరే తగ్గేదేలేదు అంటున్నారు రేవంత్ రెడ్డి. బస్తీమే సవాలంటు కేసీఆర్ పైన రేవంత్ తొడకొడుతున్నారు. ఏం చేస్తావో చేసుకో... బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను లాగేసుకోవటమే తన టార్గెట్ అని రేవంత్ తెగేసి చెబుతున్నారు. పార్టీ ఫిరాయింపులపైన కోర్టులు కూడా పెద్దగా సీరియస్ గా తీసుకోవటంలేదు. ఎందుకంటే ప్రతిపక్షంలో నుండి అధికారపార్టీలోకి ప్రజా ప్రతినిధులు ఫిరాయించటం కామన్ అయిపోయింది. ఏపీ, మధ్య ప్రదేశ్, కర్నాటక, తెలంగాణా అన్నీ రాష్ట్రాల్లోను ఫిరాయింపులు రెగ్యులర్ గా జరుగుతునే ఉన్నాయి. అధికారపార్టీలోకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిరాయించకపోతే వాళ్ళ ఆర్ధికమూలాలమీద దెబ్బపడటం ఖాయమైపోయింది. ఆర్ధికమూలాలు దెబ్బతినటమే కాదు వ్యక్తిగతంగా కేసుల్లో ఇరుక్కోవటం తప్పటంలేదు. ఈ నేపధ్యంలోనే కారణాలు ఏవైనా సరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లోకి ఫిరాయించేస్తున్నారు. ఒకవైపు ఫిరాయింపులపై బీఆర్ఎస్ వేసిన కేసు హైకోర్టు విచారణలో ఉన్నాసరే రేవంత్ భయపడకుండా యథేచ్ఛగా ఫిరాయింపులకు లాకులెత్తేస్తున్నారు. తాజాగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని పార్టీలో చేర్చుకున్నారు.

విద్యావ్యవస్థపై ప్రభుత్వం
## తీవ్ర నిర్లక్ష్యం

- రాజకీయ అంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారా..?
- టీచర్లకు, విద్యార్థులకు శాపంగా మారిన కాంగ్రెస్ పాలన
- ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణపై హరీశ్ రావు సీరియస్



8

తల్లిదండ్రులారా..
## దయచేసి జాగ్రత్తగా ఉండండి

- సోషల్ మీడియా చాలా క్రూరంగా, ప్రమాదకరంగా మారిపోయింది
- మీ పిల్లల ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్త
- మీ పిల్లలపై చేసే కామెంట్స్ చూసి మీరు తట్టుకోలేరు
- సాయి ధరమ్ తేజ్ విజ్ఞప్తి
- రెండు రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు స్పందించాలని అభ్యర్థన
- వెంటనే స్పందించిన రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క



7

## కనుల పండువగా జగన్నాథుడి రథయాత్ర

- భక్తజన సంద్రంగా పూరీ నగరం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు
- రథాన్ని లాగిన ఒడిశా ముఖ్యమంత్రి చరణ్ మాఝీ



2



## ఇది అందరి ప్రభుత్వం..

### సర్వమతాలకు ప్రాధాన్యం ఇస్తాం

- మానవ సేవే మాధవ సేవ అనే సూక్తితో మా ప్రభుత్వం పనిచేస్తుంది
- రాష్ట్రం శాంతి సౌఖ్యాలతో, సుభిక్షంగా ఉండాలి
- ఇదే నేను ఈ యాత్ర ద్వారా భగవంతుడిని కోరుకుంటున్న
- జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అందరిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జగన్నాథ రథయాత్రను ప్రారంభించారు. స్వామివారికి హారతి ఇచ్చి మిగతా2లో...



## తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం ఖాయం

- రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది
- త్వరలో పార్టీని బలోపేతం చేస్తా
- రెండు రాష్ట్రాలు నాకు రెండు కళ్లులాంటివి
- తెలుగు జాతి ఐకమత్యంగా ఉండాలనేది నా అభిమతం: చంద్రబాబు నాయుడు

**విశ్వంభర, హైదరాబాద్ :** టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో టీటీడీపీ శ్రేణులతో మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 114 | ₹ 136 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 197 | ₹ 224 |

ఈడీ, సీబీఐ కేసులున్న నేతలకు
## బీజేపీలోకి నో ఎంట్రీ

- బీజేపీలో చేరాలంటే పార్టీ నియమాలు పాటించాల్సిందే
- కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలు అభివృద్ధి చేస్తాం
- త్వరలోనే కరీంనగర్ - హసన్‌పర్తి మధ్య రైల్వే లేన్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమా



2



## ఇద్దరు సీఎం కలిసి మాట్లాడుకోవడం హర్షణీయం

- రెండు రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి
- సీపీఐ కూడా వారికి మద్దతు ఇస్తుంది
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

2



## సమాజాన్ని మానవీకరించేదే కవిత్వం

- ఉద్యమ కారుడు కవిత్వం రాయడం అభినందనీయం
- ఆర్థిక సంబంధాలు, మానవ జీవితాల విధ్వంసాన్ని కవిత్వీకరించడం అద్భుతం
- ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కే.శివారెడ్డి
- పాలమూరు అధ్యయనవేదిక ఆధ్వర్యంలో 'యుద్ధంలో పావురం' కవితా సంపుటి పుస్తకావిష్కరణ

యుద్ధంలో పావురం కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక అల్మాస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సభకు పాలమూరు అధ్యయనవేదిక మహబూబ్ నగర్ జిల్లా కన్వీనర్ ఏ. తిమ్మప్ప, నారాయణపేట జిల్లా కన్వీనర్ ఎం వెంకట్ రాములు అధ్యక్షత వహించారు. పాలమూరు అధ్యయన వేదిక నాయకులు కేసి వెంకటేశ్వర్లు ఆహ్వానం పలికిన ఈ సభకు ప్రముఖ కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కే.శివారెడ్డి పుస్తకావిష్కర్తగా పాల్గొన్నారు.

4

# తెలంగాణ గడ్డపైన టీడీపీకి పూర్వవైభవం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)
సమావేశం అయ్యారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు ఎన్టీఆర్ భవన్ కు చేరుకున్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ లోని చంద్రబాబు నివాసం నుంచి భారీ ర్యాలీగా చంద్రబాబు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు చేరుకున్నారు. అనంతరం అక్కడ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణలో రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో గెలుపు కోసం మీరంతా ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేశారు. అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టింది తెలంగాణ గడ్డపైనే. తెలుగు జాతికి అన్యాయం జరిగింది.. నా జాతిని కాపాడుకోవాలనే ఏకైక లక్ష్యంగా ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చారు. ఇప్పుడు మీ ఉత్సాహం చూస్తుంటే మళ్లీ తెలంగాణ గడ్డపైన తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని చంద్రబాబు అన్నారు.



**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండు కళ్లులాంటివి**

నాకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండు కళ్లు లాంటివి. విభజన సమయంలోనూ తెలుగుదేశం పార్టీ రెండు రాష్ట్రాల ప్రయోజనాలకోసం పనిచేసింది. విభజన పూర్తయిన తరువాతకూడా తెలుగు జాతి ఐకమత్యంగా ఉండాలని, రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ఆరోజు ఆలోచించా.. ఈరోజు అదే ఆలోచిస్తున్నా. నా చివరి రక్తబొట్టు ఉన్నంత వరకు అదే ఆలోచిస్తానని చంద్రబాబు అన్నారు. తెలంగాణలో అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీ వదల్లేదు. పార్టీ నుంచి నాయకులు తప్ప కార్యకర్తలు వెళ్లలేదు. తెలంగాణలో టీడీపీకి బలమైన క్యాడర్ ఉంది. తొందరలోనే పార్టీ బలోపేతంపై దృష్టిపెడతామని చంద్రబాబు తెలిపారు. యువకులు, ఉత్సాహవంతులతో రాబోయే కాలంలో తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తామని చెప్పారు.

**ఎన్టీఆర్.. పీవీ నర్సింహారావును మర్చిపోలేం..**

గత ఏపీ ప్రభుత్వం ఏ కారణం లేకుండా నన్ను జైల్లో పెట్టారు. ఆ సమయంలో హైదరాబాద్ లో నాకోసం మీరు చూపించిన చొరవ నా జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేను. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు రోడ్లపైకొచ్చారని చంద్రబాబు అన్నారు. తెలుగు జాతి ఎన్టీఆర్ ను ఎప్పుడూ మరిచిపోలేరు. అదేసమయంలో ఈదేశానికి ఒక దశదిశ చూపించిన వ్యక్తి పీవీ నర్సింహారావు అని చంద్రబాబు అన్నారు. 1991లో పీవీ నర్సింహారావు మొట్టమొదటి సారిగా ఆర్థిక సంస్కరణలు అమలు చేశారు. అప్పటి నుంచి దేశంలో సంపద సృష్టించడం సులభమైందని, ఎన్టీఆర్, పీవీ నర్సింహారావు లాంటి వ్యక్తులు ఈ గడ్డపై పుట్టడం తెలుగువారి అదృష్టమని చంద్రబాబు అన్నారు.

**రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు..**

అప్పట్లో.. హైదరాబాద్ అభివృద్ధిని హైటెక్ సిటీతో ప్రారంభించాను. నిన్న ఫ్లైట్ లో వస్తూ హైటెక్ సిటీ చూసి చాలా ఆనందం కలిగింది. ఈరోజు హైదరాబాద్ ప్రపంచంలలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. హైదరాబాద్ అభివృద్ధిని తరువాత వచ్చిన ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు కొనసాగించారని చంద్రబాబు అన్నారు. రెండు రాష్ట్రాల విభజన అంశాల పరిష్కారానికి నేనే చొరవ తీసుకుని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశాను. సానుకూలంగా స్పందించిన రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చంద్రబాబు అన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి జరగలన్నదే టీడీపీ అభిమతం. రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడటమే నాకు ముఖ్యం. తెలంగాణ ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం అవుతాయని భావిస్తున్నాను. తెలంగాణ ఒకస్థాయికి వచ్చింది. మళ్ళీ ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చేసే భాద్యత నేను తీసుకుంటాను. 2047కు భారతదేశం ప్రపంచంలో నెంబర్ 1 గా ఉంటుంది. దేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నెంబర్ 1 గా ఉండాలని నా ఆకాంక్ష అని చంద్రబాబు అన్నారు. మళ్ళీ జన్మంటూ ఉంటే తెలుగు గడ్డపైనే పుట్టాలని కోరుకుంటానని చంద్రబాబు అన్నారు.

## ఈడీ, సీబీఐ కేసులున్న నేతలకు బీజేపీలోకి నో ఎంట్రీ

**విశ్వంభర, కరీంనగర్:** బీజేపీలో చేరాలంటే పార్టీ నియమాలు పాటించాల్సిందేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తేల్చి చెప్పారు. ఇతర పార్టీల తరపున గెలిచిన ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పదవులకు రాజీనామా చేసి బీజేపీలో చేరాలన్నారు బండి సంజయ్. ఈడీ, సీబీఐ కేసులున్న నేతలను బీజేపీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్ కింద అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలోనే కరీంనగర్ - హసన్‌పర్తి మధ్య రైల్వే లేన్ సాధ్యాసాధ్యాలపై సర్వే పనులు పూర్తి అయ్యాయన్నారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో మీడియా ఇష్టాగోష్టిలో బండి సంజయ్ ముచ్చటించారు. గత కేసీఆర్ సర్కార్ విభజన చట్టంలోని పలు అంశాలను గాలికి వదిలేసిందన్నారు. పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నా రాజకీయ లబ్ది కోసం మరింత జఠిలం చేశారన్నారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సఖ్యతతో ఉన్నారు. చిత్తశుద్ధితో వ్యవహరిస్తే విభజన సమస్యలకు త్వరలోనే పరిష్కారం దొరికే అవకాశముంది. మరోవైపు ఈ భేటీని అడ్డం పెట్టుకుని మళ్లీ ప్రజలను ఎట్లా రెచ్చగొట్టాలా? అని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ అవకాశం ఇవ్వొద్దని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బండి సంజయ్ సూచించారు. ఈడీ, సీబీఐ సంస్థల విచారణలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతి పరులను ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఈడీ కేసులున్న వాళ్లు, ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న నేతలను బీజేపీలోకి చేర్చుకునే అవకాశం లేదన్నారు. ఇతర పార్టీల నుండి గెలిచిన ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుంటామన్నారు. ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రజా ప్రతినిధులను అనర్హులుగా చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ 'పాంచ్ న్యాయ్ పత్ర్' పేరుతో ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన కాంగ్రెస్ నేతలు... ఆ పార్టీలో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదన్నారు. పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఒకవేళ ఉప ఎన్నికలు జరిగితే, కచ్చితంగా అన్ని స్థానాల్లో బీజేపీయే గెలుస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

## కనుల పండువగా జగన్నాథుడి రథయాత్ర

**విశ్వంభర, పూరి :** విశ్వప్రసిద్ధ జగన్నాథుని రథయాత్ర సందర్భంగా పూరీ నగరం భక్తులతో నిండిపోయింది. ఒడిశాతో పాటు దేశంలోని నలు మూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో శ్రీక్షేత్రం పరిసరాలతో పాటు అక్కడి వీధులన్నీ 'జై జగన్నాథ' నినాదాలతో మార్మోగాయి. ఆదివారం సాయంత్రం జగన్నాథుడు, బలభద్ర, సుభద్ర వారి రథాలు నందిఘోష, తాళధ్వజం, పధ్వధ్వజం రథాలపై తల్లి చెంతకు పయనమయ్యారు.ఆదివారం తెల్లవారు జామున రత్న సింహాసనంపై చతుర్థామూర్తులు కొలువుదీరారు. అనంతరం జగన్నాథుడి నవయవ్వన రూపాలంకరణ చేశారు. మంగళహారతి, మైలం, అబకాశ, తిలకధారణ, గోపాలవల్లభ సేవలు తర్వాత నేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ రథాలపై చెరాపహరా ( బంగారు చీపురుతో రథాల ముందు ఊడ్చడం) చేశారు. అనంతరం ఐదున్నర అడుగుల ఎత్తుండే బలరాముడి విగ్రహాన్ని తీసుకువచ్చారు. బలరాముడి విగ్రహాన్ని ఆయన రథమైన తాళధ్వజంపై ప్రతిష్ఠింపజేశారు. అనంతరం ఆ స్వామి విగ్రహానికి అలంకరించిన తలపాగా ఇతర అలంకరణలను తీసి భక్తులకు పంచిపెట్టారు. అవి అందుకోవడానికి కోసం భక్తులు పోటీ పడ్డారు. ఆ తర్వాత ఇదే పద్ధతిలో సుభద్రాదేవి విగ్రహాన్ని కూడా బయటికి తీసుకువచ్చి పద్మధ్వజం అనే రథంపై ప్రతిష్ఠించారు. భక్తులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుండగా దాదాపు ఐదడుగుల ఏడు అంగుళాల ఎత్తుండే జగన్నాథుడి విగ్రహాన్ని భక్తుల జయధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణంలో నుంచి బయటికి తీసుకువచ్చి నందిఘోష రథం మీద ఉంచారు. ఇలా మూడు విగ్రహాలను రథాలపై కూర్చుండబెట్టే వేడుకను 'పహాండీ' అంటారు.

**కస్తూరి కళ్లాపి**

ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న స్వామిపై పూరీ సంస్థానాధీశులు గంధం నీళ్లు చిలకరించి కిందికి దిగి రథం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. అలాగే బలరాముడిని, సుభద్రాదేవిని కూడా అర్చించి వారి రథాల చుట్టూ కూడా ప్రదక్షిణ చేసి రథాలకు తాత్కాలికంగా అమర్చిన తాటి మెట్లను తొలగించారు. జగన్నాథుని రథం మీద ఉండే ప్రధాన పూజారి ఆదేశాల మేరకు కస్తూరి కళ్లాపి చల్లి హారతిచ్చి 'జై జగన్నాథా' అని బిగ్గరగా అరుస్తూ తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలు పెట్టారు.

**భక్తజన సంద్రంలో పురుషోత్తముడు**

తొలుత బలభద్రుడు తాళధ్వజ రథంపై తల్లి చెంతకు పయనమయ్యారు. ఆ తర్వాత దేవీ సుభద్రదేవీ, చివరిగా పురుషోత్తముని నందిఘోష్ రథం భక్త జన సాగరంలో మెల్లగా ముందుకు కదిలింది. భక్తజన ఘోష మధ్య పూరీ బొడొదండోలో జగన్నాథుడు దర్శనమిచ్చారు.

**రథయాత్రలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

జగన్నాథ రథయాత్ర తొలిసారి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొన్నారు. మూడు రథాల 'పరిక్రమ' చేసి దేవతలకు నమస్కరించారు. ఒడిశా ముఖ్యమంత్రి చరణ్ మాఝీ, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జగన్నాథ రథం తాళ్లను లాగి లాంఛనప్రాయంగా యాత్ర ప్రారంభించారు.



## ఆషాఢమాస బోనాల ఉత్సవాలు షురూ

(మొదటి పేజీ తరువాయి)
వరకు ఘటాల ఊరేగింపు జరిగింది. కళాకారులు పూనకాలతో ఊగిపోయారు. మరోవైపు బోనాల ఉత్సవాల ఊరేగింపు ప్రారంభమైంది. డప్పువాయిద్యాలు, పోతరాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య కోలాహలంగా ఊరేగింపు సాగింది. లంగర్ హౌజ్ నుండి గోల్కొండ కోట వరకు ఘటాల ఊరేగింపు జరిగింది. కళాకారులు పూనకాలతో ఊగిపోయారు. కాగా గోల్కొండ బోనాలకు పలువురు రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్, మేయర్ గద్వాల విజయలక్ష్మి హాజరయ్యారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. పోతురాజుల ఊరేగింపులు, విన్యాసాలు తిలకించారు. కాగా గోల్కొండ బోనాలకు పలువురు రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్, మేయర్ గద్వాల విజయలక్ష్మి హాజరయ్యారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. పోతురాజుల ఊరేగింపులు, విన్యాసాలు తిలకించారు. బోనాల పండుగ జరిగే అన్ని రోజులు భక్తులకు ప్రభుత్వం కోటలోకి ఉచిత ప్రవేశం కల్పించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హెల్త్, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ అధికారులు విధుల్లో ఉన్నారు. బోనాల పండుగ జరిగే అన్ని రోజులు భక్తులకు ప్రభుత్వం కోటలోకి ఉచిత ప్రవేశం కల్పించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హెల్త్, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ అధికారులు విధుల్లో ఉన్నారు. ఇదిలా ఉంటే వేడుకలు వీక్షించేందుకు వచ్చే భక్తులకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా జలమండలి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. అలాగే ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైయ్యే అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. అగ్ని మాపక సిబ్బంది కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే వేడుకలు వీక్షించేందుకు వచ్చే భక్తులకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా జలమండలి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. అలాగే ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైయ్యే అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. అగ్ని మాపక సిబ్బంది కూడా అన్ని ఏర్పాట్లు చేశారు.

# తగ్గేదేలే

(మొదటి పేజీ తరువాయి)
ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబునాయుడు, కేసీఆర్ ఏమాత్రం లెక్కచేయలేదు. కాబట్టి ఇపుడు రేవంత్ కూడా ఫిరాయింపులకు వ్యతిరేకంగా తీర్పుచెప్పినా పట్టించుకుంటారనే గ్యారెంటీలేదు.

**కేసీఆర్, కేటీఆర్‌ను పట్టించుకోని ప్రజలు**

శాసన వ్యవహారాల్లోకి న్యాయస్థానం జోక్యం చేసుకోదని, చేసుకున్నా పట్టించుకోవాల్సిన అవసరంలేదని తెలుసుకున్నాకే రేవంత్ యథేచ్ఛగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. 201423 మధ్య కేసీఆర్ అచ్చంగా చేసిందిదే. అవసరంలేకపోయినా ఫిరాయింపులను కేసీఆర్ విపరీతంగా ప్రోత్సహించారు. తెలంగాణాలో తనకు ఎదురే ఉండకూడదని, అసెంబ్లీలో తనను ప్రశ్నించే గొంతుకే వినబడకూడదన్న ఏకైక లక్ష్యంతో ఫిరాయింపులకు పాల్పడ్డారు. ఫిరాయింపులకు పాల్పడటమే కాకుండా టీడీఎల్పీ, సీఎల్పీలను బీఆర్ఎస్ లో విలీనం చేసుకున్నారు. కాబట్టి ఇపుడు జరుగుతున్న ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కును కేసీఆర్ కోల్పోయారనే చెప్పాలి. అందుకనే ఫిరాయింపులపై కేసీఆర్, కేటీఆర్ ఎన్ని ఛాలెంజులు చేస్తున్నా, కవ్విస్తున్నా రేవంత్ ఏమీ మాట్లాడకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. తెలంగాణా సమాజం కూడా కేసీఆర్, కేటీఆర్ను పట్టించుకోని కారణమిదే.

**రివర్స్ అయిన కేసీఆర్ బాణం**

అప్పట్లో ఫిరాయింపులను కేసీఆర్ రాజకీయశక్తుల పునరేకీకరణ అని సమర్ధించుకున్నారు. ఇపుడు రేవంత్ కూడా అదే మాటచెబుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల కోసమే తమ పాలన నచ్చి ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చి తమ పార్టీలో చేరుతున్నట్లు కేసీఆర్, కేటీఆర్ ప్రకటించుకున్నారు. ఇపుడు కాంగ్రెస్ లోకి ఫిరాయిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రేవంత్ అవే మాటలను చెప్పిస్తున్నారు. కాంగ్రెస్ లోకి ఫిరాయిస్తున్న వాళ్ళంతా నియోజకవర్గాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ లోకి మారుతున్నట్లు చెబుతున్నారు. తెలంగాణాను బంగారు తెలంగాణాగా మార్చాలనే కేసీఆర్ ప్రయత్నానికి తాము మద్దతిస్తున్నట్లు అప్పట్లో ఫిరాయింపులు చెప్పారు. ఇపుడు కూడా అదే బంగారు తెలంగాణా కోసమే తాము రేవంత్ కు మద్దతుగా నిలబడతామని ఫిరాయింపులు అంటున్నారు.

**ఈ నిజాన్ని కేసీఆర్ ఎలా మర్చిపోయాడు..?**

ఇక్కడ కేసీఆర్ మరచిపోయిందేమిటంటే కాలం సైకిల్ చక్రం లాంటిదని. చక్రంలోని పుల్లలు ఎప్పుడూ పైన ఉండవు, ఎప్పుడూ కిందనే ఉండిపోవు. పైన ఉండే పుల్లలు కిందకు, కింద ఉన్న పుల్లలు పైకి వెళుతుంటాయన్న విషయాన్ని కేసీఆర్ మరచిపోయారు. అందుకనే తెలంగాణాకు తాను శాశ్వత సీఎంని అని అనుకుని బుర్రకుతోచింది చేసుకుపోయారు. కాలం తిరగబడటంతో ఇప్పుడు ఫాంహౌస్ లో కూర్చుని ఫిరాయింపులపై నానా గోలచేస్తున్నారు. ఇప్పటికి ఏడుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎంఎల్సీలను రేవంత్ కాంగ్రెస్ లోకి లాగేసుకున్నారు. ఈనెలాఖరులో అసెంబ్లీ బడ్జెట్ సమవేశాలు మొదలయ్యేలోగా ఇంకెంతమంది కారుపార్టీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ లో చేరిపోతారో చూడాలి.

## ఇది అందరి ప్రభుత్వం..

(మొదటి పేజీ తరువాయి)
పూజలు నిర్వహించారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇస్కాన్ సంస్థ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, జగన్నాథుడి శోభాయాత్రను హైదరాబాద్ నగరంలో నిర్వహించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్వాగతిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని రేవంత్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అందరి ప్రభుత్వం. మత సామరస్యాన్ని కాపాడుతుంది.. సర్వమతాలకు స్వేచ్ఛ ఉంటుంది. వారి భావజాలాన్ని ప్రజలకు వివరించుకోవటానికి అవకాశం ఉంటుందని, అదే సమయంలో భక్తులకు అవసరమైన వసతులు, ఏర్పాట్లు చేయడం మా ప్రభుత్వం యొక్క బాధ్యతగా భావిస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రం శాంతి సౌఖ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఈ యాత్ర ద్వారా భగవంతుడిని కోరుకుంటున్నానని అన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తితో మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో మార్పు వస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు.

## ఇద్దరు సీఎం కలిసి మాట్లాడుకోవడం హర్షణీయం

**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని, ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు పెడతున్నారని, బ్రిటిష్ పాలనను గుర్తు చేసేలా మోదీ పాలన ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ నాశనం చేస్తున్నారు. సెంటిమెంటల్ గా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారు. రాజకీయ వ్యవస్థలను భ్రష్టుపట్టించారంటూ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీపై నారాయణ స్పందించారు. ఆంధ్ర, తెలంగాణ ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడుకోవడం హర్షణీయం. రెండు రాష్ట్రాల సమన్వయం అభివృద్ధికి తోడ్పాటు అవుతుంది. దీనికి సీపీఐ కూడా మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు కేంద్రంతో మాట్లాడాలని నారాయణ అన్నారు. ప్రత్యేక హోదాకోసం చంద్రబాబు పట్టుబట్టాలి. ప్రత్యేక హోదాతప్ప మరో మార్గం లేదు.. చంద్రబాబు ప్రత్యేక హోదా విషయంలో వెనక్కుతగ్గితే మేము పోరాటం చేస్తామని నారాయణ తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు మించిన సాయం కావాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి అభివృద్ధితో పాటు ఇతర విషయాలను కేంద్రంతో ప్రస్తావించాలని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సాయం అందించాలి. గతంలో కేంద్రం తీవ్ర అన్యాయం చేసింది. మౌలిక సమస్యలు, హామీలపై ముఖ్యమంత్రి కేంద్రాన్ని నిలదీయాలని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల అంశాలను గుర్తుపెట్టుకొని ముఖ్యమంత్రి కేంద్రంతో చర్చించాలి. ముందుగా ఆల్ పార్టీ మీటింగ్ పెట్టాలి. గతంలో చేసిన తప్పులు మళ్ళీ చేయకుండా రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని రామకృష్ణ అన్నారు.

## వెనక్కితగ్గని సర్కార్..

(మొదటి పేజీ తరువాయి)
ఫైనల్ కీని కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో 563 గ్రూప్1 పోస్టుల భర్తీకి సంబంధించిన జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షను.. రాష్ట్రవ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని జూన్ 13న విడుదల చేసింది. మొత్తం 4,03,667 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 3,02,172 మంది (74.86 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. తాజా ఫలితాల్లో మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించనుంది. కాగా గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి ప్రకారంగా అభ్యర్థులను ఎంపికచేయాలని నిరుద్యోగులు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తగ్గలేదు. జులై 5న నిరుద్యోగులు టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించినా.. పట్టించుకోని టీజీపీఎస్సీ 1:50 నిష్పత్తి ప్రాతిపదికనే అభ్యర్థులను ఎంపికచేస్తామని ప్రకటించింది. ఆ ప్రకారంగానే ఈ రోజు ఫలితాలను వెల్లడించింది. 1:100 నిష్పత్తి అమలు చేస్తే, న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని ఇప్పటికే రేవంత్ సర్కార్ స్పష్టం చేసింది. గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల్లో 1:50 నిష్పతి అమలు కోసం తీసుకొచ్చిన జీవో 29ని సవరించాలని గ్రూప్ 1 అభ్యర్థులు ఎంతగా డిమాండ్ చేసినా ఫలితం లేకపోయింది. ఈ జీవో వల్ల రిజర్వేషన్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# కేకే స్థానంలో రాజ్యసభకు వెళ్ళేది ఆయనేనా?

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ వదిలి కాంగ్రెస్ గూటికి చేరిన కేశవరావుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి కట్టబెట్టింది. మరి ఆయన రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ సీటును ఎవరికిస్తారు..? తెలంగాణ కాంగ్రెస్ నేతలకిస్తారా...? లేదంటే సీనియర్లకు కేటాయిస్తారా..? అసలు హైకమాండ్ ఆలోచనేంటి..? అన్నదీ ఆసక్తికరంగా మారింది.బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయిన కేకే... ఇటీవలె కాంగ్రెస్‌లో చేరారు. ఒకపార్టీ నుంచి పదవి పొంది మరో పార్టీలో చేరినప్పుడు రాజీనామా చేయడం నైతిక బాధ్యతగా భావిస్తూ... ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఒక్కరోజులోనే అమోదం లభించింది. దీంతో ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఆయనకు కీలక పదవి కట్టబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. రాజ్యసభ సభ్యత్వానికి కే కే రాజీనామా చేయడంతో ఆ సీటు ఎవరికి ఇస్తారన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా




మారింది. తెలంగాణకు చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడ వాళ్లకే సీటు ఇస్తారన్న వాదనలు వినిపించాయి. కానీ ఆ సీటును పార్టీలోని కీలక నేతకు ఇవ్వాలని కాంగ్రెస్ హైకమాండ్ ఆలోచన చేస్తుంది. ఏఐసీసీ అధికార ప్రతినిధి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి ఆ సీటు ఇవ్వడం ఖాయమంటూ తెగ ప్రచారం జరుగుతోంది. పార్టీ హైకమాండ్ ఆయనకు దాదాపుగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి జరిగిన ఎన్నికలో అభిషేక్ సింఘ్వీ అనుకోకుండా ఓటమి పాలయ్యారు. దీంతో ఆయనను మరో చోట నుంచి పెద్దల సభకు పంపాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తోంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆయనను ప్రభుత్వ సలహాదారుడిగా నియమిస్తూ... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అఫైర్స్ సలహాదారుగానూ ఆయన కొనసాగనున్నారు. అలాగే కేకేకు కేబినెట్ హోదా కూడా కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ లో చేరగానే కేశవరావుకు పదవి దక్కడంతో ఆయన కంటే ముందు జంప్ అయిన ఎమ్మెల్యేలు పెదవి విరుస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎలాంటి పదవులు ఉండబోవని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చిచెప్పినా కేశవరావు కి కేబినెట్ హోదాతో కూడిన పదవి ఇవ్వడంతో ఆయానకొక న్యాయం ఇతరులకు ఓ న్యాయమా అని అసంతృప్తితో రగిలిపోతున్నారు. మరి ఆశావహులకు సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి న్యాయం చేస్తారో చూడాలి మరి.

# ఏడాదిన్నర చిన్నారిని నేలకేసి కొట్టి

- దారుణంగా చంపేసిన వ్యక్తి
- కొంప ముంచిన సహజీవనం

**విశ్వంభర, కృష్ణా:** చిత్తూరు జిల్లాలో శనివారం అమానుష ఘటన జరిగింది. సహజీవనం పేరుతో ఓ మహిళకు దగ్గరైన ఓ వ్యక్తి ఆమె పిల్లలను భారంగా భావించాడు. మద్యం మత్తులో ఏడాదిన్నర చిన్నారిని నేలకేసి కొట్టి చంపేశాడు. ఇంటి పైనుంచి పడిపోయాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేయగా.. మహిళ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగుచూసింది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని తవణంపల్లె మండలం మాధవరం సమీపంలోని కృష్ణాపురానికి చెందిన శిరీషకు, ఐరాల మండలం జంగాలపల్లెకి చెందిన చంద్రప్రకాష్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. శిరీషకు మతిస్థిమితం సరిగ్గా లేదని, ఆమెపై అనుమానంతో చంద్రప్రకాష్ ఆమెను దూరం పెట్టాడు. కొంతకాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు.




### వేరే వ్యక్తితో సహజీవనం

భర్తకు దూరంగా ఉంటున్న శిరీషకు అదే గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడి కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ముగ్గురు పిల్లలతో కలిసి దిగుమాసాపల్లెలోని ఓ కోళ్లఫారంలో పనికి కుదిరారు. అయితే, ప్రదీప్ ఆ ముగ్గురు పిల్లలను పోషించడం కష్టమని భారంగా భావించాడు. శనివారం మద్యం సేవించి.. మత్తులో ఏడాదిన్నర వయసున్న దినేష్ అనే చిన్నారిని నేలకేసి కొట్టి చంపేశాడు. అయితే, పిల్లాడు ఇంటిపై నుంచి పడిపోయాడని.. కొన ఊపిరితో ఉన్నాడని శిరీషను నమ్మించాడు. ఇద్దరు కలిసి చిన్నారిని చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.

### బంధువుల అనుమానంతో..

ఈ విషయాన్ని శిరీష తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పింది. వారు అనుమానంతో వీడియో కాల్‌లో పిల్లాడిని చూపించాలని పట్టుబట్టారు. బాలుడి ముక్కు, నోటి నుంచి తీవ్ర రక్తస్రావం కావడాన్ని గుర్తించారు. అంతేకాకుండా ప్రదీప్ మాటతీరు, ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో శిరీష సోదరుడు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# జగ్గయ్యపేట సిమెంట్ ఫ్యాక్టరీలో పేలుడు

### ఇద్దరు మృతి, 16మందికి గాయాలు

**విశ్వంభర, జగ్గయ్యపేట :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. 16మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని విజయవాడ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్లాంట్‌లో బాయిలర్ పేలడం వల్ల ఈ ప్రమాదం జరిగింది.

**ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆరా..**

ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కంపెనీ నుండి పరిహారం అందేలా చూడాలన్నారు. కంపెనీతో పాటు ప్రభుత్వం నుంచి కూడా బాధిత కుటుంబాలకు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు అండగా నిలవాలని అధికారులు సూచించారు. గాయపడ్డ వారికి అందుతున్న వైద్యంపై అధికారులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం- ఆవుల గోవింద్**

కంపెనీ నిర్లక్ష్యం వల్లనే ఈ ఘటన చోటు చేసుకోంది. మా ఊరి నుండి చూసినప్పుడు పెద్ద బూడిద లేచింది. కంపెనీలో హిందీ వాళ్ళు చనిపోయారని చెప్పారు. మా అన్నయ్య ఉన్నాడని నాకు తెలిసింది. సెక్యూరిటీని దాటుకుని ముందుకు వెళ్ళాను. మా అన్నయ్యతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఫ్యాక్టరీలో లిఫ్ట్ కూడా పని చేయలేదు. అదే పని చేస్తే ఎంతో కొంతమంది చిన్న చిన్న గాయాలతో బయట పడే వారు. హాస్పిటల్ కి తీసుకొచ్చాం. హాస్పిటల్ లో మా అన్నయ్య చనిపోయాడు. ఇంత ఘటన జరిగినా కంపెనీ వాళ్ళు ఎలా ఉంది అని కనీసం అడగలేదు. మా అన్నయ్య కుటుంబానికి న్యాయం జరగాలి.



### 10 రోజులుగా గ్యాస్ లీక్ అవుతున్నా పట్టించుకోలేదు..

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ఉంది. ఫ్యాక్టరీలో బాయిలర్ పేలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం పూట ఈ ఘటన జరగ్గా, ఫ్యాక్టరీ వాళ్లు ఆలస్యంగా స్పందించారని బూదవాడ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో 16మందికి గాయాలయ్యాయి. ఇద్దరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత పది రోజులుగా బాయిలర్ గ్యాస్ పైపు లీక్ అవుతోందని ఫ్యాక్టరీ యజమానులకు వర్కర్స్ చెప్పినా.. వారు పట్టించుకోలేదని, దాంతో ఈ ఘోర ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా బాధితులకు వెంటనే వైద్యం అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని వాపోయారు. విజయవాడ ఆంధ్ర ఆసుపత్రిలో 8మందిని, మణిపాల్ ఆసుపత్రిలో 8మందిని చేర్చారు. మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరు మరణించారు. మృతులను ఆవుల వెంకటేశ్, పరిటాల అర్జున్ గా గుర్తించారు. వీరిద్దరూ బూదవాడ గ్రామానికి చెందిన వారు.

# నా విజయానికి తెలంగాణ టీడీపీ శ్రేణుల కృషి

- రెండు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు
- తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తా
- సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** ఏపీలో తన విజయానికి తెలంగాణ టీడీపీ శ్రేణులు తీవ్రంగా కృషి చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు (NTR Bhavan) ఆయన ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. టీటీడీపీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా జై తెలుగుదేశం, జై చంద్రబాబు నినాదాలతో కార్యకర్తలు హోరెత్తించారు. అనంతరం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణ గడ్డపై టీడీపీకి పునఃవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రెండు రాష్ట్రాలు రెండు కళ్లు**

తనకు ఏపీ, తెలంగాణ రెండు కళ్లని.. ఏపీలో తన విజయానికి తెలంగాణ నేతలు పరోక్షంగా కృషి చేశారని చంద్రబాబు అన్నారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మీయులను కలిసి అభినందనలు తెలియజేసేందుకే ఇక్కడికి వచ్చానని అన్నారు. 'మీ అభిమానం చూస్తుంటే నాకు ఉత్సాహం వస్తుంది. తెలంగాణలో అధికారంలో లేకున్నా నాయకులు పార్టీని వదిలివెళ్లారే తప్ప కార్యకర్తలు, అభిమానులు పార్టీని వదల్లేదు. సంక్షేమానికి నాంది పలికిన వ్యక్తి ఎన్టీఆర్.. ఆయన అనేక పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చారు. తెలుగుజాతి ఉన్నంతవరకూ టీడీపీ జెండా రెపరెపలాడుతుంది. ఎన్ని సంక్షోభాలు వచ్చినా వాటిని అవకాశంగా మార్చుకుని మళ్లీ అధికారంలోకి వచ్చాం. నన్ను జైల్లో పెట్టినప్పుడు టీడీపీ శ్రేణులు చూపిన చొరవ ఎప్పటికీ మరువలేను. చాలా దేశాల్లోనూ నా అరెస్టుకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. ఆ సమయంలో గచ్చిబౌలిలో నిర్వహించిన సభను మరిచిపోలేను. హైదరాబాద్‌లో నాకు మద్దతుగా ఆందోళనలు చేశారు. వారి ప్రేమ, అభిమానం ఎన్నటికీ మరువలేనిది' అని చంద్రబాబు పేర్కొన్నారు.



### 'ఇరు రాష్ట్రాల అభివృద్ధే ధ్యేయం'

ఏపీ, తెలంగాణ అభివృద్ధే టీడీపీ ధ్యేయమని చంద్రబాబు అన్నారు. నాలెడ్జ్ ఎకానమీకి టీడీపీ హయాంలోనే నాంది పలికామని.. తన తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ అభివృద్ధిని కొనసాగించాయని చెప్పారు. దీన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఐకమత్యం ఉండాల్సిన అవసరం ఉందని.. తెలుగు భాష, జాతి ప్రయోజనాలను పరిరక్షించుకోవాలని అన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య వివాదం ఉంటే నష్టాలే ఎక్కువని.. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. తెలుగుజాతి ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. ఏపీలో వైసీపీ విధ్వంస పాలనతో చాలా నష్టం జరిగిందని అన్నారు.

**సీఎంల భేటీలో కీలక అంశాలపై చర్చ**

అటు, ఇరు రాష్ట్రాల సీఎంలు శనివారం ప్రజాభవన్‌లో విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా భేటీ అయ్యారు. ఏపీ నుంచి మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్‌రెడ్డి, సీఎస్ నీరభ్ కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సలహాదారులు వేంరెడ్డి నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్ రావు, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఆర్థికశాఖ కార్యదర్శి సహా ఉన్నతాధికారులు భేటీలో పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో రాష్ట్రం నుంచి సీఎస్ సహా ముగ్గురు ఉన్నతాధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఒకవేళ ఈ కమిటీతో పరిష్కారం కాని అంశాలపై మంత్రుల కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు.







# పవిత్ర వివాహ బంధంలో వివిధ అంశాలు

"మాంగల్యం తంతునానేన మమ జీవన హేతునా
కంఠే బద్నామి శుభగే త్వంజీవ శరదశ్శతం"

హిందూధర్మములో ఉన్న ప్రతి ఒక్కరు ఒక సారైనా ఈ వేద మంత్రాన్ని వినకుండా ఉండరు.వివాహం చేసుకొనే దంపతులతో పాటు పెళ్లి చేసుకోకుండా బ్రహ్మ చారిగా ఉన్నవారైన కూడా బంధుమిత్రుల వివాహాలకు వెళ్ళినపుడైన ఈ పవిత్ర వేద మంత్రాన్ని విని ఉంటారు.భారత దేశములోనే కాక విశ్వవ్యాప్తంగా విభిన్న సంస్కృతులలో, విభిన్న జాతులలో,ఎన్నో వైవిద్యాలతో వివాహ వేడుకలు జరుగుచున్న ప్రతి వివాహ ధర్మము, లక్ష్యము ఒక్కటే.ఒక అమ్మాయి, ఒక అబ్బాయి కలిసి వధువు,వరుడు గా మారి వివాహ బంధముతో ఏకమై సంపూర్ణ జీవితాన్ని ఆనందంగా గడపాలి.తన వంశాన్ని తర్వాత తరంలో నిలుపడం ఏ వయసులో ఆ ఆనందాన్ని, కష్ట సుఖాలను పరిపూర్ణముగా పొందడం ఈ వివాహ బంధం యొక్క గొప్పతనం.



**ప్రతి మనిషికీ చేయవలసిన కొన్ని కర్మలు**

ఒక కవి పెళ్లి ని ఉద్దేశించి తెలుపుతూ "పెళ్లంటే పందిళ్లు, సందళ్ళు,చప్పట్లు,తాళాలు, తలంబ్రాలు, మూడే ముళ్ళు,ఏడే అడుగులు " అని పెళ్లి యొక్క గోప్పతనాన్ని వివరించాడు. హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం చూస్తే ప్రతి మనిషికీ చేయవలసిన కొన్ని కర్మలు ఉంటాయి.అదే విధంగా ఏ మతాన్ని తీసుకున్న కూడా వారు వారు చేయవలసిన కర్మలు వారికి ఉంటాయి.అంటే విశ్వవ్యాప్తంగా ఉన్న అందరికి వారు పాటించే ధర్మాలను అనుసరించి వారు చేసే విధానాలు మాత్రమే తేడాగా ఉంటాయి.కానీ వారి వారి పద్ధతుల్లో చేస్తారనేది మాత్రము వాస్తవం.ఒక కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితుల వల్ల కావచ్చు లేదా మరేయితర కారణమైన కూడా కొన్ని పద్ధతులు మార్చిన మరికొన్నింటిని మాత్రం తప్పకుండా చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఏ పద్దతిలో చేసినా,ఏ ఆచారములో చేసిన, ఏ మతములో చేసినా కూడా అంత్యంగా ఆశించేది మాత్రము, వివాహాము చేసుకున్న జంట కలకాలం,సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో పిల్లా పాపలతో ఉండాలని కోరుకోవడమే....

**మనిషి జీవన చక్రం ఎలా కరిగిపోతుంది**

మనిషి జీవితంలో ఉన్న నాలుగు దశలైన బాల్యం,కౌమారం, యవ్వనం మరియు వార్ధక్యం లలో బాల్యం పసితనపు ఆటపాటలతో గడిచిపోతే,కౌమారం జ్ఞానాన్ని నేర్చుకోవడంలో గడిచిపోతుంది. ముసలితనము మాత్రము గత స్మృతులతో ,ఆనందమయ జ్ఞాపకాలతో గడుస్తుంది.ఇక మిగిలిన యవ్వనం మాత్రము గతానికి భిన్నంగా,ముసలితనానికి ముందుగా బలంగా జీవితాన్ని శాశించే ఒక దశ. యవ్వనంలో ఒక మనిషి తనకు తోడుగా,జీవితాంతం ఉండే విధంగా,ధర్మబద్ధంగా,నమ్మిన దైవసాక్షిగా, బందు మిత్రుల సమక్షంలో ఏకమై "నేను నీకు,నీవు నాకు"జీవితాంతం ఒకరికిఒకరుగా బ్రతుకుదాం అని నమ్మిన దైవ సాక్షిగా చేసే ప్రమాణ కార్యక్రమమే వివాహం.ఈ ఇద్దరి బంధమే వివాహ బంధం. యువతీ యువకుల నుండి వైవాహిక బంధముతో కలిసి పరిపూర్ణ జీవిత ఆరంభసంబురమే వివాహ మహోత్సవం. హిందు ధర్మం ప్రకారం వివాహానికి ధార్మిక ప్రాధాన్యత మరియు సామాజిక ప్రాధాన్యతలు ఉన్నాయి.వివాహ సమయంలో చదివే వేద మంత్రాలు లేదా మనం వినే వేద మంత్రాలకు ప్రత్యేక శక్తి ఉంది.ఇందులో వచ్చే కొన్ని శబ్దాలు దైవానుగ్రహం కోసమైతే మరికొన్ని కుటుంబం కోసం, వారి అభివృద్ధి కోసం మరియు ఆనందం కోసం ఉంటాయి.ఏ మతములో చూసినా ప్రత్యేక విధానం అనేదానివల్ల అందరి ఆనందం మరియు అభివృద్ధి ముడిపడి ఉన్నాయి. ఏ విధంగా చేసిన దంపతుల భావి జీవితం బాగుండాలని అనికోవడమే మన ఉద్దేశ్యం.వివాహ వయసు వచ్చినతర్వాత ఆడపిల్ల తల్లిదండ్రులు మంచి వరుడికొఱకు అన్వేషణ ప్రారంభిస్తారు.బంధువుల ద్వారా మిత్రుల ద్వారా సంబంధాన్ని కుదుర్చుకోవడం కొరకు ప్రయత్నం చేస్తారు. అన్ని విధాలుగా నచ్చితే సంబంధం కలుపుకోవడము కొరకు మరింత ముందుకెళుతారు. ఇప్పుడున్న సాంకేతిక యుగంలో కూడా అమ్మాయి అబ్బాయి ఫోటోలను చూసుకోవడము,జాతకాలు చూసుకోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవడం,విద్యా ఉద్యోగము పరిశీలించడము మంచి చెడు విచారించి ముందుకు వెలుచున్నారు. ఒకరికి ఒకరు అన్ని రకాలుగా నచ్చితే వివాహ వేడుకలలో జరిగే మొదటిదైన "పెళ్లిచూపులు" ఏర్పాటు అవుతున్నాయి.వివాహవేడుకలలో ముఖ్యమైన అంశాలను చూస్తే దాదాపుగా ముప్పైకి పైగా ఉంటాయి.ఇవన్నీ కూడా పెళ్లిచేసుకునే వారితో పాటు రెండు కుటుంబాలకు మరియు ఇరువైపులా ఉండే బంధుమిత్రుల మధ్య ఒక మంచి బంధం ఏర్పడడానికి ఉపయోగపడుతుంది.దీని వల్ల కలకాలం అందరూ కలిసి మెలసి ఉండేలా ఉపయోగపడుతుంది.



**ఆన్ లైన్ పెళ్లిలు**

**ప్రస్తుత పరిస్థితిలో ఆన్ లైన్ లో పెళ్లి చూపులు,వారం రోజుల్లోనే పెళ్లి,ఉద్యోగం రీత్యా విదేశాల్లో ఉండడం వల్ల త్వరితంగా వివాహవేడుకలు ముగించవలసి వస్తుంది. పూర్వకాలం నుండి వస్తున్న ఆచారాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ వారసత్వంగా ముందుకు తీసుకవెళ్ళవలసిన అవసరం ఉంది. మన రాజ్యాంగం ప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు వచ్చి వారు ఇష్టపూర్వకంగా పెళ్లిచేసుకుంటే ఎలాంటి అభ్యంతరం ఉండదు.ఈ రోజుల్లో రిజిస్టర్ మ్యారేజీలు,ఉంగరాలు మార్చుకోవడం,దండలు మార్చుకోవడం వల్ల పెళ్లి తంతును పూర్తిచేస్తున్న వారుకుడా ఉన్నారు.ఏదిఏమైనా సంప్రదాయాలను పాటిద్దాం. వివాహవేడుకలు నిర్వహిద్దాం.ఖర్చులు తగ్గిద్దాం.**

**వివాహ బంధం ఎలా ఏర్పడుతుంది..?**

వివాహ బంధములో ఉండే అంశాలను పరిశీలిస్తే "పెళ్లి చూపులు,నిశ్చయతాంబూలం, స్నాతకం(విగ్నేశ్వర్ పూజ తో ప్రారంభం), వరపూజ,గౌరీపూజ, మైలపోలు, మంగళ స్నానాలు, కురాళ్లు మరియు దుంపిడి గుంజ తేవడం, సుంకు పట్టడం, ఐరేండ్ల పూజ, ఎదురుకోళ్లు, మధుపర్కాలు, యజ్ఞోపవీత ధారణ, మహాసంకల్పం, కాల్లు కడగడం, సుముహూర్తం(జీలకర్ర బెల్లం తలపై పెట్టడం), కాళ్ళు తొక్కించడం, కన్యాదానం,మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు, బ్రహ్మముడి, ఉంగరాలు తీయడం,సప్త పదిపాణిగ్రహణం, హోమం,సన్నికల్లు,నాగవల్లి, సదస్యం (పూజల తర్వాత తాంబూలం ఇవ్వడం) ,పూసలు కుచ్చడం, అరుంధతి దర్శనం,ఉయ్యాల బొమ్మను అప్పగించడం,పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం,అప్పగింతలు చేయడం"తో వివాహ వేడుక ముగిసి వారు దంపతులుగా మారతారు.

పెళ్లి చూపులతో ఒకరిని ఒకరు ఇష్టపడి, నిశ్చయ తాంబూలంలో బంధు మిత్రుల సమక్షములో వరపూజ మరియు పూలు పండ్లు పెట్టడం పూర్తి చేసుకొని పెళ్లి ముహూర్తాన్ని అందరి సమక్షంలో వేద బ్రాహ్మనులచే ముహూర్తం నిర్ణయిస్తారు.ఆ తేదీని అనుసరించి వివాహం జరుగు ప్రదేశం,తేదీ లాంటి వివరాలతో వివాహ ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధు మిత్రులకు ఆహ్వానం పంపిస్తారు. పెళ్లి ముహూర్తానికి మూడు రోజుల ముందు నుండి మిగిలిన కార్యక్రమాలు జరుగుతాయి.మంగళ స్నానాల తో పాటు,హల్దీ మరియు సంగీత్ కూడా ఈ మధ్య తప్పనిసరి అయినవి.ముహూర్తానికి ఒకరోజు ముందు కురాళ్లు పట్టడం,మట్టెలు మంగళ సూత్రాలు తేవడం,దుంపిడి గుంజ తేవడం,సుంకు పట్టడం చేస్తారు.ముహర్తానికి ముందు అయిరేండ్ల పూజ చేసి పెళ్లి మంటపము నకు బాజాబాజంత్రీల తో వెళతారు.అక్కడ వరుడిని ఎదురుకొని పెళ్ళిమంటపములోకి వధువు సోదరులు భుజాల పై వరుడిని తీసుకుని వెళతారు.అక్కడ నుండి వేద బ్రహ్మణులచే మిగిలిన అన్ని కార్యక్రమాలు పూర్తి చేయబడతాయి. పెద్దల ఆశీర్వాదం తో కోలాహలంగా ,బంధువుల సమక్షములో కార్యక్రమము ముగుస్తుంది.వచ్చిన అథితులందరూ ఆశీర్వదించి భోజనాలు చేస్తారు. ఆ తర్వాత ఆట విడుపుగా రకరకాల కార్యక్రమాలను కూడా ఈ మధ్యనిర్వహిస్తున్నారు.ఈ వివాహ వేడుకల్లో ఆర్థిక పరిస్థితిని అనుసరించి కొన్ని కార్యక్రమాలు మారిన,కొన్ని నామమాత్రంగా చేసిన,కొన్ని మతపరంగా వేరుగా ఉన్న,వారివారి హోదాను బట్టి అథితి మర్యాదలతో వివాహ వేడుకలు ముగిస్తారు. పెళ్లి చేసేవారి హోదాను బట్టి ఏర్పాట్లు,మర్యాదలు ఉంటాయి.ఆర్భాటాలకు వెళ్లకుండా,ఉన్నంతలో పెళ్లి చేయడం మంచిది.



-గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com

# సమాజాన్ని మానవీకరించేదే కవిత్వం

యుద్ధంలో పావురం కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక అల్మాస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సభకు పాలమూరు అధ్యయనవేదిక మహబూబ్ నగర్ జిల్లా కన్వీనర్ ఏ. తిమ్మప్ప, నారాయణపేట జిల్లా కన్వీనర్ ఎం వెంకట్ రాములు అధ్యక్షత వహించారు. పాలమూరు అధ్యయన వేదిక నాయకులు కేసి వెంకటేశ్వర్లు ఆహ్వానం పలికిన ఈ సభకు ప్రముఖ కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కే.శివారెడ్డి పుస్తకావిష్కర్తగా పాల్గొన్నారు. కవి యాకుబ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆచార్యకే శివారెడ్డి గారు మాట్లాడుతూ ఖలీల్ కార్మిక రంగ నాయకుడిగా ఉద్యమకారుడిగా అనేక సమస్యలపై పనిచేస్తూ కవిత్వం రాయడం అభినందనీయమన్నారు. సులభమైన భాషల్లో ప్రజల సమస్యల్ని కవిత్వీకరించడం చేశారన్నారు. తన కవిత్వంలో అమరుల త్యాగాలను ఎత్తి పట్టడం నుండి అమ్మ ప్రేమను పంచే దాక సాగిందన్నారు. ఆర్థిక సంబంధాలు మానవ జీవితాల్ని విధ్వంసం చేస్తున్న దృశ్యాల్ని కవిత్వీకరించడం ఈ సంపుటి యొక్క ప్రత్యేకత అని కొనియాడారు. విద్వేషాలు, వైసమ్యాలు రాజకీయ ఎజెండాగా ఉన్న సందర్భంలో మానవుడే కేంద్రంగా కవిత్వం రావడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. కవిత్వం అంటేనే మానవ సమాజాన్ని మానవీకరించడం అని అన్నారు.యుద్ధంలో పావురం కవితా సంపటిలో అటువంటి కృషి జరిగిందని అన్నారు. అన్నం మెతుకును, వెలిగే దీపాన్ని, కుల మత వివక్షతను ,ప్రజా పోరాటాలను కవిత్వంలో స్పర్శించారని ఆయన తెలిపారు.



**మతం కాదురా..**

**మనం మనసులమని గొంతెతి చాటాలి**

కవి యాకుబ్ గారు మాట్లాడుతూ పుట్టిన సామాజిక వర్గాన్ని కేంద్రం చేసుకొని ఇవాళ్ళ విద్వేషాలు రెచ్చగొడుతున్న సందర్భంలో ముస్లిం సామాజిక తరగతి నుండి కవిత్వం రాయడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. మతం కాదురా మనం మనసులమని గొంతెతి చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. "వీలైతే పువ్వై పరిమళించు. కాకుంటే మౌనంగా ఉండు. ముళ్ళు వై గుచ్చుకోకనే సందేశాన్ని కవిత్వంలో ప్రస్తావించారని యాకూబ్ గారు తెలిపారు. ఖలీల్ కవిత్వాన్ని అందరూ చదవాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఉద్యమ కవి ఖలీల్**

పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవాచారి గారు మాట్లాడుతూ ఖలీల్ అనేక సందర్భాలలో రాసిన కవిత్వాలను వడిసి పట్టుకుని కవితా సంపుటి తేవడంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి కృషి ఉందని తెలిపారు. విద్యార్థి దశ నుండే ఖలీల్ ఉద్యమాలలో భాగస్వామమౌతు కరువు వ్యతిరేక పోరాట కమిటీ, పాలమూరు అధ్యయన వేదిక నిర్వహించిన సభలలో పాల్గొంటూ తన కవిత్వాన్ని కూడా వినిపించారని ఆయన తెలిపారు. శ్రామిక వర్గ పోరాటాలలో వాటి అనుభవాలలోంచి, సమస్యలను సదికరిస్తూ కవిత్వం రాశాడన్నారు. చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి మాట్లాడుతూ మహిళల సమస్యల్ని ఖలీల్ కవిత్వంలో స్పష్టంగా వివరించడం జరిగిందన్నారు.

**కార్మిక సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి ఖలీల్**

టిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు, V3 ఛానల్ ఎండి కాచం సత్యనారాయణ గారు మాట్లాడుతూ గత పుష్కరకాలంగా తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం అవుతూ కార్మిక సమస్యలపై పోరాటం నిర్వహిస్తూ ఖలీల్ ఒక కవిగా కూడా ఎదగడం అభినందనీయమని అన్నారు. ఈ సభలో ప్రముఖ సామాజిక వేత్త అనీఫ్ అహ్మద్, రెహమాన్, తదితరులు ఆప్త వాక్యం పలికారు. ఈ కార్యక్రమంలో కవి జనజ్వాల, వల్లభాపురం జనార్ధన్, ఖాజా మైనద్దీన్, లుంబిని లక్ష్మణ్ గౌడ్, జ్ఞాన భారతి లక్ష్మణ్ , తెలంగాణ జేఏసీ నాయకులు రాజేందర్ రెడ్డి, కే ఎన్ పి ఎస్ నాయకులు డి చంద్రశేఖర్, కె ఏ ఎన్ పి ఎస్ నాయకులు బండారి లక్ష్మణ్, టి ఎఫ్ టి యు నాయకులు పి విజయకుమార్, పి యాదగిరి, జి గట్టన్న, ఫరీద్ పూర్ మాజీ సర్పంచులు సుప్రియ, నాగలక్ష్మి, సిపిఐ నాయకులు బాలకృష్ణ, సిఐటియు నాయకులు వేణుగోపాల్, సిపిఎం నాయకులు వెంకట్ రాములు, ఐఎఫ్టియు నాయకులు అరుణ్ కుమార్, టీపీఎఫ్ నాయకులు బుచ్చారెడ్డి, భూషణ్, గాయకులు జక్కగోపాల్ పద్మావతి శ్యామల సురేష్, ప్రముఖ కళాకారుడు అమరచింత వెంకట్ రాములు గారు పాలమూరు అధ్యయన వేదిక నాయకులు ఐ నారాయణ , మైనార్టీ నాయకులు జబ్బర్ ముజాహిద్, ఖలీద్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.



# కాకలు తీరిన కమ్యునిస్టు యోధుడు జ్యోతిబసు

## నిబద్ధత కలిగిన నేత జ్యోతిబసు

### జూలై 8... జ్యోతిబసు జయంతి

భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యో ద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్ లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్ ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు... నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళాశాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవహర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్ గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూనియన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసన సభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా



ఉన్న సమయంలో శాసన సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగాల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహరించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 1 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొన సాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించిన నాయకుడు



**విశ్వంభర, నారాయణపూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల మహ్మదాబాద్ గ్రామ లింక్ రోడ్లలో ఇరు వైపుల చెట్లు అడ్డంకిగా మారాయి. దీంతో రాకపోకలకు రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు ఈ విషయం తెలుసుకున్న మహ్మదాబాద్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లబోతూ సురేష్ యాదవ్ వెంటనే స్పందించారు. లింక్ రోడ్లలో చెట్లను దగ్గర ఉండి తొలగించారు. దీంతో రైతులు సురేష్ యాదవ్ ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేశారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**విశ్వాంబర, ఆమనగల్లు, జులై 7:** 199798 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు జిల్లా బాలుర ఉన్నత పాఠశాల లో 26 సం.లు గడిచిన సందర్భంగా ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకొని కేకు కట్ చేసి పట్టణ కేంద్రంలో పలుచోట్ల స్నేహానికి గుర్తుగా మొక్కలు నాటారు పూర్వ విద్యార్థులు బాబా, సురేష్, దశరథ్, ప్రవీణ్, రమేష్, శీను, రాజు, పర్వతాలు, బాలస్వామి, శ్రీనివాస్ గౌడ్, గణేష్, అంజి, యాదగిరి, శ్రీధర్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999.2000 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థిని విద్యార్థులు తాము చదువుకున్న తరగతి గదులలో తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, శ్రీరాముల్ రెడ్డి, రాములు, శ్రీనివాసరావు విద్యాసాగర్,పూర్వ విద్యార్థులు జగదీశ్వర్, అనిత, మహిమున, నారాయణ, శ్రీనివాస్, జితేందర్ ,లింగస్వామి పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల 15వ వసంతోత్సవం



**విశ్వంభర, యాదగిరిగుట్ట,జూలై 07 :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల దాతరుపల్లి గ్రామ 20082009 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మ సమ్మేళనాన్ని శుభం గార్డెన్ పాత గుట్ట రోడ్, యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 15 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థిని విద్యార్థులు తాము చదువుకున్న తరగతి గదులలో తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ప్రభుత్వానికి విద్యపై శ్రద్ధ లేదు: కడ్తాల్ బిఆర్ఎస్ పార్టీ

**విశ్వంభర, ఆమనగల్లు, జులై 7:** కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యపై ఏమాత్రం శ్రద్ధ లేదని కడ్తాల్ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచిపోయిన విద్యను పట్టించుకోకుండా రాష్ట్రానికి మద్యానికి మంత్రి నియమించారు కానీ విద్యకు మంత్రిని నియమించలేదని మండిపడ్డారు. ఈరోజు కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నూతనంగా ఏర్పడిన కస్తూరిబా భవనాన్ని ప్రారంభించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెలగడుస్తున్న ఇంతవరకు భవనాన్ని ఎందుకు ప్రారంభిస్తలేరని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలపాలని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లో పాఠశాల భవనాన్ని ప్రారంభించకపోతే బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడుతుందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్నగర్ డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి, రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య, డైరెక్టర్ లాయక్ అలీ, శీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పీర్జాదిగూడ ఆదర్శం

- మౌలిక సదుపాయల కల్పనకు పెద్దపీట
- నియోజకవర్గం అభివృద్ధికి కృషి
- శ్రీ సాయి నగర్ కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా/మేడిపల్లి విశ్వంభర:** మౌలిక సదుపాయల కల్పన,అభివృద్ధిలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు పీర్జాదిగూడ ఆదర్శంగా నిలిచిందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ శ్రీ సాయి నగర్ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.... బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో తెలంగాణ అభివృద్ధిలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు దిక్సూచిగా నిలించిందన్నారు. 24 గంటలు నాణ్యమైన కరెంట్, ఫ్లై ఓవర్లు, ఐటి, ఫార్మ, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది. మిషన్ భగీరథ ద్వారా రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి ప్రతి గడపకు మంచి నీరు అందించిన ఘనత కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శి రఘు వర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, బచ్చ రాజు, మద్ది యుగేందర్ రెడ్డి,కొడే పోచయ్య, మధుసూదన్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, అలవాల దేవేందర్ గౌడ్, జావీద్ ఖాన్, డివిజన్ అధ్యక్షులు బాలరాజు, వెంకన్న,శ్రీనివాస్, కిరణ్, మల్లం వెంకటేష్ గౌడ్,సాయి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు బింగి ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఆరుట్ల నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలాన్ని ఒకటే పంచాయతీగా ఉంచాలి

- మూడు పంచాయతీలుగా చేస్తే భద్రాచలం అస్తిత్వాన్ని కోల్పోతుంది
- ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు



విశ్వంభర, భద్రాచలం : భద్రాచలాన్ని ఒకటే పంచాయతీగా కొనసాగించాలని, మూడు పంచాయతీలుగా విభజిస్తే భద్రాచలం తన అస్తిత్వాన్ని కోల్పోతుందని, భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలం గ్రామ పంచాయతీని మూడు పంచాయతీలుగా విభజిస్తూ చేసిన జీవోను రాష్ట్ర గవర్నర్ ఆమోదించడాన్ని వారు తప్పుపట్టారు. దక్షిణ అయోధ్యగా పిలవబడుతున్న భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు పంచాయతీలుగా విభజిస్తే తన అస్తిత్వాన్ని కోల్పోతుందని మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర విభజనలో భద్రాచలం కు అనుకుని ఉన్న ప్రాంతమంతా ఆంధ్రాలో కలవడంతో భద్రాచలం తీవ్రంగా నష్టపోయిందనీ, పట్టణంలో సేకరించిన చెత్తను కూడా పారబోయడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నామని, శ్మశాన వాటికకు కూడా స్థలము లేదని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు ముక్కలు చేస్తే పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని, అభివృద్ధికి దూరమవుతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం మూడు పంచాయతీల ప్రతిపాదనను ముందుకు తెచ్చిన సందర్భంలో సిపిఎం పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే అధికార, ప్రతిపక్ష పార్టీలు అనివార్యంగా భద్రాచలం గ్రామపంచాయతీని ఒకే గ్రామ పంచాయతీగా కొనసాగిస్తామని హామీలు గుప్పించాయని అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభల్లో భద్రాచలం ఒకే గ్రామపంచాయతీగా కొనసాగించేందుకు కృషి చేస్తామని ప్రకటించారని నేడు మూడు గ్రామపంచాయతీలుగా చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం ను ఒకే గ్రామపంచాయతీ గా కొనసాగించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు పంచాయతీలుగా విభజించే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం గంగా, వై వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్, నకిరికంటి నాగరాజు, భూపేంద్ర, జి లక్ష్మీకాంత్ నాయకులు బి జె ఎల్ పి దాసు ఎంబీఎస్ నారాయణ జి నాగలక్ష్మి, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# షిరిడి నగర్ కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర



**విశ్వంభర కూకట్‌పల్లి ప్రతినిధి :** ఆల్విన్ కాలనీ డివిజన్, షిరిడి నగర్ కాలనీలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం పాదయాత్ర చేశారు. కాలనీ వాసులు విద్యుత్, డ్రైనేజ్, నాలాకు సంబంధిత సమస్యలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొని రాగా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ షిరిడి నగర్ అసోసియేషన్ ఆఫీస్ నిర్మాణం, ఓపెన్ నాలా క్లీనింగ్, చిన్న కాల్వర్టర్ కు పెండింగ్ వర్క్స్ తొందరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మోజెస్, కాలనీ అధ్యక్షులు సీహెచ్. శ్రీధర్, జెనరల్ సెక్రటరీ డి.మూర్తి, అమరెందర్ రెడ్డి, ప్రవీణ్ సింగ్, సురేష్, సాయిబాబా, కరుణాకర్, సారంగపాని, శ్రీనివాస్ రావు, సాయి కుమార్, చంద్రమౌళి, అశోక్, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, షాద్ నగర్ :**

పట్టణంలోని ప్రగతి విద్యాలయం ఉన్నత పాఠశాలలో 200708 పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి రిసార్ట్లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాధాకృష్ణ, నరేందర్, శశికాంత్ బాలరాజ్, రహిమ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపకాల అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమర్నాథ్, సందీప్, అభిలాష్, రామకృష్ణ, సాయి మేఘ్య, ప్రియాంక, సంధ్య, స్వప్న, శారద, విజయలక్ష్మి, అనురాధ, నందిని పాల్గొన్నారు.



# ఆ బ్యాంకులపై ఆర్బీఐ కొరడా

**విశ్వంభర, హైదరాబాద్:** దేశ ఆర్థిక వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూడడంలో భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) చాలా కీలకంగా వ్యవహరిస్తుంది. దేశంలో డబ్బు ప్రవాహాన్ని నియంత్రించడం, ద్రవోల్బణం లేకుండా చూడడం, వివిధ బ్యాంకులకు సహాయ సహకారాలు అందజేయడం దీని ప్రధాన విధులు. తద్వారా దేశంలో ఆర్థిక స్థిరత్వం కలగడం, అభ్యున్నతి దిశగా పయనించడానికి అవకాశం కలుగుతుంది.



**నియంత్రణ..**

రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా దేశంలోని వివిధ బ్యాంకుల కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. వాటికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుంది. ఒకవేళ ఆ బ్యాంకులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.1.31 కోట్ల జరిమానా విధించింది. అలాగే షింషా సహకార బ్యాంకు లైసెన్స్ ను రద్దు చేసింది. ఆయా బ్యాంకులు నిబంధనలను సక్రమంగా పాటించకపోవడంతో ఈ చర్యలు తీసుకుంది.

**తనిఖీలు..**

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్బీ) రుణాలు, అడ్వాన్స్ లు, కేవైసీకి సంబంధించి కొన్ని నిర్దిష్ట ఆదేశాలను పాటించలేదు. ఆ బ్యాంక్ ను 2022 మార్చి 31న తనిఖీ చేసినప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఈ విషయాన్ని గమనించింది. వాటిపై సమాధానం చెప్పాలని బ్యాంకుకు నోటీసులు జారీ చేసింది. దానికి పీఎన్బీ నుంచి వచ్చిన ప్రత్యుత్తరాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత జరిమానా విధించింది.

**నిబంధనల ఉల్లంఘన..**

సబ్సిడీలు / వాపసులు / రీయింబర్స్‌మెంట్ల ద్వారా ప్రభుత్వం నుంచి స్వీకరించదగిన మొత్తాలకు వ్యతిరేకంగా రెండు రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేషన్‌లకు వర్కింగ్ క్యాపిటల్ డిమాండ్ రుణాలను పీఎన్బీ మంజూరు చేసినట్లు ఆర్బీఐ గుర్తించింది. అలాగే కొన్ని ఖాతాలలో వ్యాపార సంబంధాల సమయంలో కస్టమర్ల గుర్తింపు, వారి చిరునామాలకు సంబంధించిన రికార్డులను భద్రపరచడంలో విఫలమైంది. దీంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌పై రూ. 1.31 కోట్ల ద్రవ్య పెనాల్టీ విధించింది.

**షింషా బ్యాంకు లైసెన్సు రద్దు..**

కర్ణాటకలోని షింషా సహకార బ్యాంక్ పైనా ఆర్బీఐ చర్యలు తీసుకుంది. ఆ బ్యాంకు ఆర్థిక పరిస్థితి దిగజారుతున్న నేపథ్యంలో దాని లైసెన్స్‌ను రద్దు చేసింది. దీంతో జూలై 5వ తేదీ సాయంత్రం నుంచి బ్యాంకింగ్ వ్యాపారం నిలిచిపోయింది. బ్యాంకును మూసివేయడానికి, అలాగే బ్యాంకు కోసం లిక్విడేటర్‌ను నియమించడానికి ఆర్డర్ జారీ చేయాలని కర్ణాటక సహకార సంఘాల రిజిస్ట్రార్‌ను కూడా కోరింది. లిక్విడేషన్ ప్రకారం డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) నుంచి రూ. 5 లక్షల వరకు ఖాతాదారులు డిపాజిట్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ స్వీకరించడానికి అర్హులు. షింపా బ్యాంకులో 99.96 శాతం డిపాజిటర్లు డీఐసీజీసీ నుంచి తమ డిపాజిట్ల పూర్తి మొత్తాన్ని స్వీకరించడానికి అర్హులు అని ఆర్‌బీఐ తెలిపింది.

**ప్రయోజనాలకు విఘాతం..**

షింపా బ్యాంకుకు తగిన మూలధనం, సంపాదన అవకాశాలు లేవని ఆర్బీఐ తెలిపింది. అందువల్ల దాని కొనసాగింపు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని వివరించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆ బ్యాంకు ఖాతాదారులకు సంబంధించి బీమా చేసిన డిపాజిట్లలో రూ.11.85 కోట్లను ఇప్పటికే డీఐసీజీసీ చెల్లించింది.

# గంజాయి తరలిస్తున్న సూర్యాపేట యువకుడు అరెస్ట్



**విశ్వంభర మేడిపల్లి జులై 7 :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పీర్జాదిగూడ సాయి నగర్ కాలనీ ఏరియాలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదం తిరుగుతున్న యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. టీవీఎస్ మోటార్ సైకిల్ తిరుగుతున్న ఒక వ్యక్తిని పట్టుకుని విచారించగా దాదాపు 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. వెంటనే అతని అదుపులో తీసుకొని టీవీఎస్ మోటార్ సైకిల్ స్వాధీనం పరుచుకొని మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతడిని విచారించగా సారగండ్ల శివ (20) పిర్జాదిగూడలోని సాయి క్రిష్ణ నగర్ కాలనీ ఉంటున్నట్లు తెలిపాడు, అతడి సొంత ప్రాంతం సూర్యాపేటగా పేర్కొన్నాడు. శివపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి తెలిపారు.

# సునీల్ రావుపై వైద్యుల అంజన్ కుమార్ ఆగ్రహం



**విశ్వంభర, కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సునీల్ రావుపై వైద్యుల అంజన్ కుమార్ ఫైర్ అయ్యారు. మహాలక్ష్మీ పథకం అమలు చేస్తున్నది మా ప్రభుత్వమే కదా అన్నారు. ఆర్థిక పరిస్థితి దిగజారి పోయిన నేపథ్యంలో అసలు, వడ్డీ కట్టకుంటూ ప్రభుత్వాన్ని నెట్టుకొస్తూ పథకాల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. రుణ మాఫీ అమలును ఆగస్టు 15 న అమలు చేసి తీరుతామని చెప్పి ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించినప్పటికీ కాంగ్రెస్ పార్టీపై సునీల్ రావు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి అవినీతితో నాణ్యత లేకుండా ప్రాజెక్టులు కట్టి మేమేదో చేశామని ఢంకా బజాయించుకునే సంస్కృతి నుండి బీఆర్ఎస్ పార్టీ మేయర్ బయటకు రావాలని హితవు పలికారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు పదవులు కట్టబెట్టే విషయంలో పార్టీ నాయకత్వం వాయిదా వేసిందా..? కుర్చీ కోసం దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకుంటే ఇప్పుడు ఆరోపణలు చేయడానికి కారణం ఏంటీ..? ఆయన పార్టీలో ఉన్నప్పుడు సీనియర్లను, పార్టీకి అంకిత భావంతో పనిచేసిన వారిని పక్కనపెట్టి మరి పదవులు కట్టబెట్టినప్పుడు వాయిదా పద్దతులు గుర్తుకు రాలేదా..? ఇప్పుడు పథకాల అమలు విషయంలో వాయిదాల ప్రభుత్వం అంటూ ఆరోపించడం వెనక కారణాలు ఏంటీ..? ఆనాడు నీకు రాజకీయ జన్మనిచ్చిన జగపతిరావు కుమారుడు రాజేందర్ రావు పై, పెంచి పెద్ద చేసిన కాంగ్రెస్ పార్టీని కాదని వెళ్లి ఇప్పుడు అదే పార్టీని విమర్శిస్తున్న తీరు వెనక ఆయన పార్టీ మారాలన్న ఆలోచనకు బ్రేకులు పడడం వల్లే అసహనం వ్యక్తం చేస్తున్నట్టుగా అనిపిస్తోందని అంజన్ కుమార్ మండిపడ్డారు.

## సీఎం రేవంత్ ఊరుకు డివైడర్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**విశ్వంభర, కల్వకుర్తి, జూలై 7:** వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి లో రూ.21 కోట్లతో మంజూరైన డివైడర్ రోడ్డును నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి, ఎంపీడీవో విజయభాస్కర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన వంశీచంద్ రెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు, జులై 7:** ఏఐసీసీ నాయకులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. గుర్లకుంట తండాకు చెందిన రాజునాయక్ కుటుంబానికి మరియు చరికొండ గ్రామానికి చెందిన కొత్తపల్లి జంగయ్య, చిందం గుండాలు కుటుంబాలను మరియు మాజీ ఎంపీపీ పాలకుర్ల బుగ్గయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రేఖ్యాతండా మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కీ'శే సభావట్ కృష్ణ నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ పార్టీకి చెందిన ముఖ్యమైన నాయకులు మరణించడం ఎంతో బాధాకరమని అన్నారు. వీరందరీ కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీచ్య నాయక్, డిసిసి ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, సీనియర్ నాయకులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, సేవాదళ్ లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు జాంగిర్ బాబా, మాజీ ఎంపీటీసీ అద్దాల రాములు, లక్పతి నాయక్ రామచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగులమందు తాగి యువకుడు మృతి



పురుగుల మందు తాగి మృతి చెందిన యువకుడు

**విశ్వంభర, చివ్వెంల :** పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని కుడకుడలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కనకరత్నం తెలిపిన వివరాల ప్రకారం కుడకుడ గ్రామానికి చెందిన గుడ్డేటి మహేష్ (28) కు సంవత్సరం క్రితం అదే మండలంలోని గాయంవారిగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మితో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో 6 నెలల క్రితం ఇద్దరు విడిపోయారు. మహేష్ అప్పటి నుండి తాగుడుకు బానిస అయ్యాడు. అతని తల్లి మందు ఎందుకు తాగుతున్నావని మందలించింది. శనివారం సాయంత్రం ఇంట్లో తల్లితో గొడవపడి ఆమె బయటికి వెళ్లగానే పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. తల్లి ఇంట్లోకి వచ్చి చూసి వెంటనే మహేష్ ను సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించింది. మహేశ్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తల్లి యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కనకరత్నం వెళ్ళడించారు.

# దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్ చైర్మన్‌గా బి.వి.శ్యామ్ కుమార్

- ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకమండలి
- ఏకగ్రీవ ఎన్నిక అభినందనీయం: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**విశ్వంబర, ఎల్బీనగర్ :** దక్షిణ షిర్డిగా విరాజిల్లుతున్న దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షిర్డి సాయి సంస్థాన్ ట్రస్ట్ నూతన పాలకమండలి ఆదివారం కొలువుదీరింది. చైర్మన్ గా బి.వి.శ్యామ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులతో ట్రస్ట్ ఎన్నికల అధికారి ఆదివారం సాయినాథుని సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని ఆయన అభినందించారు. ఏకగ్రీవానికి కృషి చేసిన మాజీ చైర్మన్ గుండా మల్లయ్య బృందం కృషిని కొనియాడారు. ట్రస్టీలను ఏకతాటి మీదకు తీసువచ్చిన గుండా మల్లయ్యి ల్‌సుఖ్‌నగర్ శ్రీ షిర్డి సాయి సంస్థాన్ ట్రస్ట్ ఏర్పాటైన నాటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి ఎన్నికలు నిర్వహించి నూతన పాలకమండలిని ఎన్నుకోవటం ఆనవాయితీగా వస్తుంది. అయితే గతంలో పలుమార్లు ఎన్నికలు లేకుండా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆచరణసాధ్యం కాలేదు. అయితే గత రెండు సంవత్సరాలుగా చైర్మన్ గా వ్యవహరించిన గుండా మల్లయ్య తన పనితీరుతో అం దర్ని మెప్పించగలిగాడు. దీంతో ఈ సారి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ట్రస్ట్ సభ్యులందరిని ఆయన ఒప్పించి ఏకతాటిపైకి తీసుకువచ్చాడు. దీంతో రెండేళ్ల పాటు (20242026) కొనసాగనున్న నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని, కొత్త సంప్రదాయానికి తెరీశారని పలువురు ప్రశంసిస్తున్నారు.

**నూతన పాలకమండలి సభ్యులు వీరే..**

చైర్మన్ గా బి.వి.శ్యామ్ కుమార్, ప్రధానకార్యదర్శిగా రఘుకుమార్, కోశాధికారిగా వూర నర్సింహాగుప్తా, వైస్ చైర్మన్ ఆర్.శివశంకరరావు, పి. వీరప్ప, జాయింట్ సెక్రటరీలుగా కోడి రాజశేఖర్, బి.కిరణ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పద్మాకర్ ఆత్రే, యం.శ్యామలరావు, సాయికృష్ణ షిండే, పి. కృష్ణవేణిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో గుండా మల్లయ్య, మాజీ చైర్మన్లు బచ్చు గంగాధర్, వనం యాదయ్య, వనం రంగయ్య, ఇవివి నాగేశ్వరరావు శర్మ, వి.బాబురావు,వి రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# బహుజనులు రాజ్యాధికారం సాధిస్తేనే దేశ అభివృద్ధి సాధ్యం

**విశ్వంభర, మేడ్చల్ :** అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం 281 ఆదివారాలుగా బోడుప్పల్లో విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర కమిటీ సభ్యులు మాజీ మావోయిస్టు శ్రీరాముల శ్రీనివాస్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీరాముల శ్రీనివాస్ మాట్లాడుతూ కులరహిత సమాజమే అంబేద్కర్ ఏకైక లక్ష్యమని, స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచిన ఇంకా కులాలు,మతాల పేరుతో చంపుకుంటున్నారన్నారు. భారత రాజ్యాంగం భారతీయులందరికీ సమానమైన హక్కులు విధులు కల్పించినప్పటికీ బడుగు బలహీన వర్గాలు ఇంకా అట్టడుగు స్థానంలోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధనికులు ఇంకా ధనవంతులవుతున్నారని, దళిత బహుజనులు ఏకమై రాజ్యాధికారం సాధించినప్పుడే అంబేద్కర్ కలలు సహకారం అవుతాయని శ్రీరాముల శ్రీనివాస్ అన్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ఆకాంక్షలను భవిష్యత్తే తరానికి అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో బహుజనుల రాజ్యాధికారం లక్ష్యంగా పనిచేస్తామని, ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, నత్తి విజయ్ కుమార్, కమగల బాబు, కంచి సతీష్, సవరపు బయన్న, జై భీమ్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.




# వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

**విశ్వంభర చింతపల్లి జులై 07:** వరుస చోరీలకు పాల్పడుతున్నారని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్టు నాంపల్లి సర్కిల్ సిఐ నవీన్ కుమార్ తెలిపారు.. చింతపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 26న చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన గోరేటి బక్కమ్మ తన ఊరి శివారులో వున్న కంచెరకాలనీ వద్ద గల తన వ్యవసాయ పొలానికి వెళ్లి వస్తుండగా నాగార్జునసాగర్ హైదరాబాద్ హైవే పై ఇద్దరు వ్యక్తులు ఒక బైకు పైన ఆమె వద్దకు వచ్చి ఇది ఏ ఊరు పెద్దమ్మ అని అడుగుతూ ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని బైకు పైన పారిపోయారు. దీనిపై చింతపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోద యింది. దేవరకొండ డిఎస్పి గిరిబాబు ప్రత్యేక పర్యవేక్షణలో ఎస్సై చింతపల్లి, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, సిసి కెమెరాల ఫుటేజ్ లను పరిశీలించారు. వాహన తనిఖీని నిర్వహిస్తూ ఆదివారం చింతపల్లి గ్రామంలోని సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న హైవే పైన ఈ నేరంలో పాలుపంచుకున్న ఇద్దరు నేరస్తులను పట్టుకున్నారు. కుర్రా తుల్చా నాయక్ తండ్రి బాలు అలియాస్ హనుమంతు యొక్క స్వస్థలం బాలేంపల్లి గ్రామం అడవిదేవులపల్లి ధరావత్ బాలకృష్ణ అలియాస్ సిద్ధూ తండ్రి వీరన్న నాయక్ బాలాజీనగర్ కోదాడ సూర్యాపేట జిల్లా వీరి వద్ద నుండి 39 గ్రాముల (3.9 తులాల) బరువు ఉన్న బంగారు పుస్తెల త్రాడు హోండా షైన్ మోటార్ సైకిల్ , రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగినది. ఈ హోండా షైన్ మోటార్ సైకిల్ . నిడమానూరు గ్రామంలో రైస్ మిల్ ఎదురుగా రోడ్డు వెంట పార్కు చేసి ఉండగా తేదీ: 18062024 రోజున వీరు దొంగతనం చేసిన్నట్టు తెలిపారు.. మరొక నిందితుడైన రమావత్ వంశీ నాయక్, బాలేంపల్లి గ్రామం, అడవిదేవులపల్లి మండలం, పరారీలో ఉన్నాడు. ఇట్టి కేసు చేదనలో భాగమైన సీఐ నాంపల్లి, ఎస్సై చింతపల్లి, సిబ్బంది అయినా సైదులు, కిరణ్, శివకుమార్, రాంబాబు లను నల్లగొండ జిల్లా ఎస్పీ అభినందించారు.



## ఖమ్మం జిల్లా మంత్రులపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఫైర్

**విశ్వంభర, ఖమ్మం:** బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ ఆదేశాలతో మృతి చెందిన రైతు బోజేడ్ల ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరగాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రతినిధి బృందం అన్నారు. తొలుత జిల్లా పోలీస్ కమిషనర్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రొద్దుటూరు గ్రామంలో బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్మీట్ లో రైతు బోజేడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని మృతిని కుటుంబానికి సర్వత న్యాయం చేయాలని ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని అన్నారు. మేము వస్తాం అని తెలిసే వరకు కూడా స్థానిక ఎమ్మెల్యే భట్టికి రావడానికి సమయం లేదు అని మేము వస్తున్నాం కాబట్టి వచ్చాడు అని దుయ్యబట్టారు. కనీసం బాధిత కుటుంబానికి సహాయం చేయాలి అనే ఇంగితజ్ఞానం కూడా భట్టి విక్రమార్క కు లేదు అని మండిపడ్డారు.ఈ జిల్లా లో ముగ్గురి మంత్రులలో ఒక్కరికి కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించాలన్న జ్ఞానం లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. భట్టి విక్రమార్క బాధిత కుటుంబాన్ని పరామర్శించి నిందితుల ఇంటికి ఎలా వెళ్తారు అని...? ప్రశ్నించారు.ఈ రాష్ట్ర ప్రతినిధుల బృందంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శి జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జడ్పీ చైర్మన్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజ్, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి లు ఉన్నారు.





## నాటుసారా తయారీ కేంద్రాలపై ఆబ్కారీశాఖ దాడులు

**విశ్వంభర, ఆమనగల్లు, జులై 7:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామంలో 400లీటర్ల బెల్లం పానకాన్ని ఆబ్కారీ పోలీసులు ధ్వసం చేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో నాటు సారాను గుట్టుచప్పుడు కాకుండా తాయారు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, తండాలలో గుడుంబా తయారీకి అడ్డాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం గుడుంబా పూర్తిగా నిషేధించిన కొందరు అడవులు, గుట్టలు ఎంచుకొని నాటు సారా తాయారు చేస్తున్న పరిస్థితి ఉంది. స్థానికుల సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామంలో ఎంఫోర్స్ మెంట్, హయత్ నగర్ ఆబ్కారీ సీఐ, ఆమనగల్లు అబ్కారీశాఖ ఆధ్వర్యంలో మూడు టీమ్ లు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400లీటర్ల బెల్లం ధ్వసం చేసి, 12లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. ఒకరిని అరెస్ట్ చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నారని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బైద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ అరుణ్ కుమార్, ఎస్సై శంకర్, హెడ్ కానిస్టేబుల్ నర్సింహా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో ఘనంగా జగన్నాథ రథయాత్ర



**విశ్వంభర, మెట్‌పల్లి :** ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర మెట్పల్లి పట్టణంలో కనుల పండువగా జరిగింది. కీర్తి ఫంక్షన్ హాల్ వద్ద బలరాముడు సుభద్ర దేవి జగన్నాథ స్వాముల వారికి పూజలు నిర్వహించి రథయాత్ర ప్రారంభించారు. కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వడి నర్సింగరావు, నాయకులు స్వామివారి రథాన్ని పురవీధుల గుండా లాగారు. ప్రతి ఏటా పూరీలో జరుగు జగన్నాథ రథయాత్రను కనులారా వీక్షించని భక్తులు ఇస్కాన్ ఆధ్వర్యంలో ముఖ్య పట్టణాలు, గ్రామ ప్రజల్లో రథోత్సవాలు చేపడుతుండటంతో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులను లోనై ఇస్కాన్ ప్రభుదాసులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఎస్ఐ సంతోష్ కుమార్ అభినందనలు

**విశ్వంభర, పరిగి :** మండల పరిధిలోని కుదవంద్పూర్ గేటు సమీపంలో ఈదురు గాలులతో చెట్లు విరిగి పరిగి నుండి షాద్నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో అడ్డంగా పడ్డాయి. దీంతో ఆ రహదారిపై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఆ విషయాన్ని స్థానికులు ఎస్సై సంతోష్ కుమార్ కు తెలియజేయడంతో ఆదివారం పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ ఖుదవంద్పూర్ గ్రామానికి వెళ్లి దగ్గరుండి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను జెసిపి సహాయంతో తొలగించేందుకు కృషి చేశారు. స్థానిక ప్రజలు, వాహనదారులు ఎస్ఐ సంతోష్ కుమార్ పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



# రాబోయే మూడు రోజులు వర్షాలే

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన




**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ కీలక సూచన చేసింది.. వచ్చే ఐదు రోజులు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళా ఖాతంలో, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ఇప్పుడు సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి కొనసాగుతున్నదని.. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.. ఆంధ్రప్రదేశ్ లో వచ్చే మూడు రోజులు ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**ఆదివారం:** తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 3040 కిలోమీటర్ల వేగముతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.

**సోమవారం:** తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 3040 కిలోమీటర్ల వేగముతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.

**మంగళవారం:** తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

**దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్..**

**ఆదివారం:** తేలికపాటి నుంచి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 3040 కిలోమీటర్ల వేగముతో కొన్నిచోట్ల వీచే అవకాశముంది.

**సోమవారం:** తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 3040 కిలోమీటర్ల వేగముతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.

**మంగళవారం:** తేలికపాటి నుంచి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

**రాయలసీమ:-**

**ఆదివారం, సోమవారం:** తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 3040 కిలోమీటర్ల వేగముతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.

**మంగళవారం:** తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.



## వైఎస్ జయంతికి రేవంత్ రాక

**విశ్వంభర, అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 8న ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఐసీసీ సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్టాన్ని అభివృద్ధిపథంలో నడిపారని రుద్రరాజు గుర్తు చేశారు. ఈనెల 8న జరిగే వైఎస్ జయంతి సభలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్యం ఠాగూర్, ఇతర నేతలు పాల్గొంటారని వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4గంటలకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా సోనియా గాంధీ పీసీసీ ఛైర్మన్ షర్మిలకు లేఖ పంపారని రుద్రరాజు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మాట్లాడుతూ.." 58లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుంది. రాయలసీమలో కక్షలు లేకుండా చేసిన వ్యక్తి వైఎస్ఆర్. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థుల జీవితాలు మార్చిన గొప్ప నాయకుడు వైఎస్. మైనారిటీలకు ఆయనే 5శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయణ్ని స్మరించుకుంటూ సోమవారం జయంతి వేడుకను ఘనంగా నిర్వహిస్తాం. జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డైరెక్షన్ ఆధ్వర్యంలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి... హైదరాబాద్‌లో నిన్న (శనివారం) చంద్రబాబుతో సమావేశం అయ్యారు. విభజన హామీలకు అనుగుణంగానే చర్చలు జరిగాయి. విభజన చట్టం షెడ్యూల్ 9, 10ప్రకారం ఏపీకి రావాల్సిన వాటా వస్తుంది" అని చెప్పారు.

## రేపు బీజేపీ మహిళా మోర్చా ధర్నా



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ మహిళా మోర్చా ఈ నెల 9వ తేదీన ధర్నాకు పిలుపునిచ్చిందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే ఆందోళనలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 213రోజులు అవుతుందని, మహాలక్ష్మి పథకం కింద పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అని చెప్పారని ఇంతవరకు ఎందుకు హామీలు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ప్రతి మహిళలకు రూ.2500 వందలు ఇస్తా అన్నారు అది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ మహిళా మోర్చా ఈ నెల 9వ తేదీన ధర్నాకు పిలుపునిచ్చిందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే ఆందోళనలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 213రోజులు అవుతుందని, మహాలక్ష్మి పథకం కింద పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అని చెప్పారని ఇంతవరకు ఎందుకు హామీలు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ప్రతి మహిళలకు రూ.2500 వందలు ఇస్తా అన్నారు అది లేదన్నారు. 18 సంవత్సరాలు దాటిన యువతలకు స్కూటీలు ఇస్తానని అన్నారు. అది లేదని చెప్పారు. రాష్ట్రంలో మహిళపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు , హత్యలు జరుగుతున్న ప్రభుత్వం రక్షణ కల్పించడంలో విఫలం అయిందని ధ్వజమెత్తారు. గిరిజన మహిళ హత్య జరిగితే.. ఇంతవరకు గిరిజన మంత్రి సీతక్క ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి హోం శాఖను హ్యాండిల్ చేయడం రాకపోతే అది మరొకరికి ఇవ్వాలని హితవు పలికారు. డ్రగ్స్‌ను అణచివేస్తామని సీఎం రేవంత్ చెప్పారని కానీ గజాయ్ మత్తులో యువత ఊగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని శిల్పారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాతబస్తీలో విద్యుత్ సిబ్బందిపై దాడి

**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత చేసిన ఆరోపణలు నిజమయ్యాయి. ఓల్డ్ సిటీలో ఎవరైనా అధికారి వెళ్లి ప్రభుత్వానికి రావాల్సిన బిల్లులు వసూలు చేయగలరా అని, ఇది తెలిసినా ఇప్పటివరకూ ఉన్న ప్రభుత్వాలు ఎందుకు దీనిపై చర్యలు తీసుకోలేదు అని తెలంగాణ లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ మహిళా నాయకురాలు మాధవీలత ప్రశ్నించారు. తాజాగా ఆమె చెప్పిందే జరిగింది. హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ అధికారులపై స్థానికులు దాడికి యత్నించారు. మీరాలం దర్గా ప్రాంతంలో సంబంధిత సిబ్బంది విద్యుత్ కనెక్షన్లను పరిశీలించడానికి వెళ్లారు. ఇది గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులపై దాడికి దిగుతూ తరిమికొట్టే ప్రయత్నం చేశారు. వారి వద్ద ఉన్న విద్యుత్ బకాయిలకు సంబంధించిన పేపర్లు, రిపోర్ట్స్ చింపేసినట్లు తెలుస్తోంది. మీరాలం దర్గా వాసులు వాగ్వాదానికి దిగి, దాడికి యత్నించడంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు పెట్టడం కలకలం రేపుతోంది. నెలలు తరబడి కరెంట్ బిల్లులు చెల్లించడం లేదని, పరిశీలించి కలెక్షన్లు తొలగించడానికి విద్యుత్ సిబ్బంది వెళ్లగా.. స్థానికులు వారిపై దాడికి పాల్పడి భయభ్రాంతులకు గురిచేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బీజేపీ రిటర్న్ గిఫ్ట్ ఇదేనా

### సింగరేణికి అన్యాయం
- కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో బీజేపీకి ప్రజలు 8మంది ఎంపీలను గెలిపిస్తే.. బీజేపీ ఇచ్చే తొలి రిటర్న్ గిఫ్ట్ ఇదేనా? అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. పెద్దపల్లిలోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు గనుల వేలాన్ని అభ్యంతరం చెప్పాల్సిన సీఎం రేవంత్ రెడ్డి మోదీని ఆహ్వానిస్తున్నాడన్నారు. మోదీ తాన అంటే.. రేవంత్ రెడ్డి తందానా అంటున్నాడన్నారు. వేలం వేయడం మంచిదే అని కేంద్రానికి మద్దతు ప్రకటిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ ధ్వజమెత్తారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి వేలాన్ని వ్యతిరేకిస్తూ మోదీకి లేఖ రాశారని.. మరి ఇప్పుడు సీఎం హోదాలో రేవంత్ రెడ్డి ప్రధానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు.

**ఎందుకు వేలం వద్దని చెప్పడం లేదు..**

బొగ్గు బావుల వేలం వద్దని ఎందుకు విజ్ఞప్తి చేయట్లేదని నిలదీశారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రేపు వేలం కార్యక్రమంలో పాల్గొనబోతున్నారని.. వేలంలో పాల్గొనడం అంటే.. బొగ్గు బావుల మీద సింగరేణి హక్కులేదని అని ఒప్పుకోవడమేనన్నారు. సింగరేణికి నేరుగా కోల్‌మైన్స్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వేలం వేయడం తప్పులేదు అని అంగీకరిస్తున్నారన్నారు. సింగరేణి కార్మిక సంఘాలు కూడా ఈ విషయంలో స్పందించానల్నారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ, ప్రభుత్వం తీరుపై మిత్రపక్షం సీపీఐ నేతలు ఏమంటారో చెప్పాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న బొగ్గు నిల్వల కోసం సర్వేలు, కోట్లు ఖర్చుపెట్టి బొగ్గు బ్లాకులను వెలికి తీసిందన్నారు. బొగ్గు రవాణా కోసం కోట్లు ఖర్చు పెట్టి రైల్వే లైన్లు వేసి, అనేక సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయించుకున్నటువంటి సింగరేణి అన్నారు. చస్నాల మైనింగ్ విపత్తు 27 డిసెంబర్ 1975న భారతదేశంలోని బీహార్ (ప్రస్తుతం జార్ఖండ్) రాష్ట్రంలోని ధన్‌బాద్ సమీపంలోని చస్నాలాలోని బొగ్గు గనిలో పేలుడు సంభవించి వరదల కారణంగా 375 మంది మరణించారని.. ప్రైవేటు సంస్థలకు ప్రమాద కారణమైనటువంటి గనులను ఇవ్వకూడదని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

**ఎఫ్ఆర్‌బీఎం కోసమే రాష్ట్ర ప్రభుత్వం మోకరిల్లింది..**

రక్షణ విషయంలో బొగ్గు గనుల్లో అత్యంత ప్రావీణ్యం కలిగిన సంస్థ సింగరేణి సంస్థ సింగరేణి అన్నారు. సింగరేణిని ప్రైవేటుపరం చేయొద్దని.. వెంటనే వేలం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్‌బీఎం కోసం రాష్ట్ర ప్రభుత్వం మోకరిల్లిందని.. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలానికి పచ్చజెండా ఊపి వారం తిరగక ముందే విద్యుత్తు వ్యవస్థను అదానీ కంపెనీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. బీఆర్ఎస్‌కు 16ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మకశక్తిగా ఉంటామని కేసీఆర్ చెబితే.. 16 సీట్లతో ఏం చేసుకుంటారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏపీలో 16 సీట్లు గెలుచుకున్న టీడీపీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుందని.. చెరో 8 స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్, బీజేపీ సింగరేణిని ఖతం చేస్తున్నాయని ఆరోపించారు.

## హాస్టల్ లో బీర్ బాటిళ్లు

### పార్టీ చేసుకున్న టెన్త్ క్లాస్ స్టూడెంట్లు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్లో మద్యం రాజ్యమేలుతుంది. నిన్న సూర్యాపేట జిల్లాలో ప్రిన్సిపాల్ రూంలో బీర్ బాటిళ్లు దొరికాయి. ఈ ఘటన మరువకముందే కొద్ది గంటల్లోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూర్ బీసీ హాస్టల్ లో మద్యం బాటిళ్లు కనిపించాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలోని బీసీ హాస్టల్ లో అర్ధరాత్రి బీర్ బాటిళ్లు దర్శనమిచ్చాయి. బీసీ హాస్టల్ పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పుట్టిన రోజు. దీంతో హాస్టల్ వార్డెన్ లేని సమయంలో తోటి విద్యార్థులు కేక్ కట్ చేసిన అనంతరం హాస్టల్ లోనే పార్టీ చేసుకున్నారు. అయితే కేక్ పార్టీ కాదు. మద్యం పార్టీ చేసుకున్నారు విద్యార్థులు. బీరు బాటిళ్లు హాస్టల్ కు తెచ్చుకొని తాగుదామనే టైంలో హాస్టల్ పక్కన నివాసం ఉంటున్న స్థానికులు చూసి విద్యార్థులను మందలించారు. దీంతో విద్యార్థులు అక్కడి నుంచి పరారైపోయారు. దీంతో బీర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ ఎక్కడివడే ఉన్నాయి. ఈ ఘటన అర్ధరాత్రి 11 గంటల తరువాత జరిగినట్లుగా స్థానికులు తెలిపారు. అయితే పాలకుర్తి ఎమ్మెల్యే సొంత గ్రామం చర్లపాలెం కావడం గమనార్హం.

## ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

### ఆ రెండు పార్టీలు పన్నాగాలు చేస్తున్నాయి

### మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపణలు



**విశ్వంభర, హైదరాబాద్:** అవినీతి సంపాదనతో ఆ నాడు కేసీఆర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గొప్ప, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి రాహుల్ గాంధీకి లేఖ రాసే అర్హత లేదన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్వాకంతో పదవులు పోయాయని గులాబీ పార్టీనేత నిరంజన్ రెడ్డి లెటర్ రాయాలన్నారు. నిరంజన్ రెడ్డి కృష్ణా నదిని కూడా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆయన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రధాన మంత్రి పదవి కాళ్లదగ్గరకు వచ్చినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వదులుకున్నారని చెప్పారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. ఆరెండు పార్టీలు అంబేద్కర్ ఆయాశయాలను కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రం లో ఆరు గ్యారంటీల అమలు, ప్రజా పాలన సాగుతుందని కాంగ్రెస్ లోకి వస్తున్నారని తెలిపారు. ఆ రోజు 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ , బీజేపీ నాయకులకు విలువల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. అంబేద్కర్, రాజ్యాంగంపై వాళ్లకు విలువలు ఉంటే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందే వారే కదా అని నిలదీశారు. ప్రభుత్వం ఏర్పడ్డ రెండు నెలల్లోనే కూలి పోతుందన్నారు. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకొని కాంగ్రెస్‌ను కూల్చాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. రాజ్యాంగాన్ని నిలబెట్టడం కోసమే తమ ప్రయత్నమని మంత్రిజూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన ఎస్సై మృతి



**విశ్వంభర, హైదరాబాద్:** ఆత్మహత్యాయత్నం చేసిన భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట సబ్ ఇన్స్‌పెక్టర్ శ్రీరాముల శ్రీను మృతి చెందారు. ఆయన జూన్ 30న శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ చనిపోయారు. శ్రీను మరణం గురించి ఆయన భార్య కీలక ఆరోపణలు చేసింది. తన భర్త ఆత్మహత్యాయత్నానికి సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుల్ లు కారణం అని ఫిర్యాదు చేసింది. దీంతో ఉన్నతాధికారులు సీఐతో సహా నలుగురు కానిస్టేబుల్ లను విధుల నుండి తప్పించారు. చనిపోయే ముందు ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఇచ్చిన మరణ వాంగ్మూలంలో కూడా పలువురు పోలీసుల పేర్లు చెప్పారు. కానిస్టేబుల్స్ సన్యాసి నాయుడు, శేఖర్, సుభాని, శివ నాగరాజు సహా సీఐ వేధింపుల కారణంతోనే తాను ఆత్మహత్య చేసుకున్నట్లుగా శ్రీరాముల శ్రీనివాస్ చెప్పినట్లు సమాచారం.

# తల్లిదండ్రులారా.. దయచేసి జాగ్రత్తగా ఉండండి

### కలిసి పనిచేద్దామంటూ హితవు

### చిన్న పిల్లల వీడియోలపై డిప్యూటీ సీఎం స్పందన

**విశ్వంభర, హైదరాబాద్:** ఈ మధ్య తెలుగు యూట్యూబర్స్ చిన్న పిల్లల వీడియోలపై కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. ఫనుమంతు అనే పేరుతో యూట్యూబ్ ఛానల్ రన్ చేస్తున్న ఒక తెలుగు యూట్యూబర్ తన ఛానల్‌లో తన ఫ్రెండ్స్‌తో కలిసి లైవ్ వీడియోస్‌కి రియాక్షన్ ఇవ్వడం, కామెంట్స్ చేయడం వంటివి చేస్తాడు. అయితే తన ఫ్రెండ్స్‌తో కలిసి ఒక వ్లాగ్ చేస్తూ.. చిన్నపిల్లలపై లైంగిక కామెంట్లు చేశారు. దీంతో ఈ వీడియో ఫుల్ కాంట్రావర్సీగా మారింది. ఈ విషయంపై నెటిజన్లతో పాటు టాలీవుడ్ నటుడు సాయి ధరమ్ తేజ్ ఎక్స్ వేదికగా స్పందించాడు. సోషల్ మీడియాను ఎక్కువగా వాడే తల్లిదండ్రులకు సాయి తేజ్ తాజాగా ఓ విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా చాలా క్రూరంగా, ప్రమాదకరంగా మారిపోయింది. దయ చేసి జాగ్రత్తగా ఉండండి. కంట్రోల్ చేయడం చాలా కష్టంగా మారింది. పొరపాటున ఒక్క పోస్ట్ పెడితే చాలు దారుణమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి మీరు మీ పిల్లల ఫోటోలు, లేదా వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసేటప్పుడు దయచేసి జాగ్రత్తగా ఉండండి.. కొంతమంది మీ పిల్లలపై చేసే కామెంట్స్ చూసి మీరు తట్టుకోలేరు. మిమ్మల్ని ఎంతగానో బాధపెడతాయి ఆ కామెంట్స్.. మీ పిల్లల ఫోటోలు, వీడియోలు షేర్ చేయకపోవడం మంచిది అని నా భావన. అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు తేజ్. ఈ పోస్ట్‌కు తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు తెలంగాణ డీజీపీ, ఆంధ్రప్రదేశ్ సీఎం, ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఎక్స్ ఖాతాలను ట్యాగ్ చేశాడు. అయితే ఈ పోస్ట్‌పై తాజాగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాడు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎక్స్‌లో స్పందిస్తూ.. ఇలాంటి క్లిష్టమైన సమస్యను లేవనెత్తినందుకు ధన్యవాదాలు సాయిధరమ్ తేజ్. పిల్లల భద్రత అనేది నిజానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చే విషయం. మా ప్రభుతం పిల్లల పట్ల జరుగుతున్న అగాయిత్యాల పట్ల, సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తున్న వాళ్ళ పట్ల జరుగుతున్న ఘోరమైన విషయాల పట్ల కచ్చితంగా చర్యలు తీసుకుంటుంది. మన పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ ప్రపంచాన్ని సృష్టించడానికి అందరం కలిసి పని చేద్దాం. అంటూ భట్టి రాసుకోచ్చాడు.



# విద్యారంగంపై నిర్లక్ష్యం

- రేవంత్ కు హరీశ్ లేఖ
- ప్రజా సమస్యలు గాలికొలేస్తున్నారు
- రాజకీయాలు మాత్రమే చేస్తున్నారంటూ విమర్శ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఏర్పాటయ్యాక సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి అనేక చర్యలు తీసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. అరకొర వసతులు, టీచర్ల కొరత, పాఠ్యపుస్తకాల కొరత, దుస్తుల కొరత, తాగునీటి కొరత, వేతనాల చెల్లింపు ఆలస్యం తదితర సమస్యలు తెలంగాణ విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్నాయని విమర్శించారు. విద్యాశాఖ నిర్వర్తిస్తున్న మీరు, రాజకీయ అంశాలకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు తప్పా.. ప్రజా సమస్యలను పరిష్కరించడం పై ఏమాత్రం దృష్టి సారించడం లేదన్నారు. అధికారం లోకి వచ్చిన ఏడునెలల సమయంలో కొత్తగా చేసిందేమీ లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం చేస్తున్నవి కొనసాగించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలన టీచర్లకు, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు మన బడి' అనే మహోన్నత కార్యక్రమాన్ని ప్రారంభిస్తే, దాన్ని కొనసాగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సన్నబియ్యానికి బదులు ముక్కిన బియ్యంతో భోజనం పెడుతున్నారని.. విద్యార్థుల పౌష్టికాహారం కోసం అందించే కోడి గుడ్ల బిల్లులు సైతం చెల్లించని పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. రెండు జతల స్కూల్ యూనిఫామ్ ఇవ్వకుండా ఒకే జత బట్టలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నది ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించవద్దనే మనవతా దృక్పథంతో గత ప్రభుత్వం 27వేల పాఠశాలల్లో ప్రారంభించిన 'సీఎం బ్రేక్ ఫాస్ట్' కార్యక్రమాన్ని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది, మరోవైపు సకాలంలో వేతనాలు అందక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పాఠశాలల్లో దోమలు, ఈగలు ముసురుతున్నాయి. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకపోవడంతో సిలబస్ ప్రకారం, పాఠ్యాంశాలు పూర్తి కావడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కరెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో అంధకారం అలుముకుంటున్నది. పాఠశాల విద్యావ్యవస్థను ఇన్ని సమస్యలను చుట్టుముట్టినా మీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం బాధాకరమన్నారు. భావిభారత పౌరులను తయారుచేసే పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేయడం విద్యాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే పాఠశాల విద్యను గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు.



## దివ్యాంగ విద్యార్థులకు లోకేష్ అండ

- సమస్యలు పరిష్కరించేందుకు జీవో
- అధికారులకు ఆదేశాలు

**విశ్వంభర, అమరావతి:** దివ్యాంగ విద్యార్థుల సమస్యలపై వాట్సాప్ సమాచారంతో వెంటనే మంత్రి నారా లోకేష్ స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి జీవో ఇచ్చి 25మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తును కాపాడారు. లోకేష్‌కు దివ్యాంగ విద్యార్థి మారుతీపృధ్వీ సత్యదేవ్ సహ ఇతర దివ్యాంగ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. రేపు ఉండవల్లి నివాసంలో ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థల్లోప్రవేశం పొందిన దివ్యాంగ విద్యార్థులను కలిసి అభినందించనున్నారు. మంత్రి చూపిన చొరవతో ఐఐటీ, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే అవకాశాన్ని కల్పించారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో విజయవాడకు చెందిన దివ్యాంగ విద్యార్థి మారుతీ పృధ్వీ సత్యదేవ్ 170 ర్యాంకు సాధించారు. ఈ ర్యాంకు ప్రకారం సత్యదేవ్ కు చెన్నయ్ ఐఐటీలో సీటు పొందారు. దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే మార్కుల మెమోలో మార్పులు చేయకపోతే ప్రవేశం కుదరదని చెన్నై ఐఐటీ తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ర్యాంకు సాధించిన దివ్యాంగ అభ్యర్థి సర్టిఫికేట్ అప్ లోడ్‌లో సమస్య వాట్సాప్ ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన లోకేష్ సంబంధిత విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

## ఓడిపోయినందుకే రిలాక్స్ గా ఉన్నా

### జగ్గారెడ్డి కామెంట్స్




**విశ్వంభర, హైదరాబాద్:** గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినందుకు చాలా ప్రశాంతంగా ఉన్నానని, తాను ఇప్పుడు రిలాక్స్ అవుతున్నానని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా తాను ఓడిపోయానని బాధపడొద్దని చెప్పారు. సంగారెడ్డిలో ఘనంగా జగ్గారెడ్డి జన్మదిన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు, జగ్గారెడ్డి అభిమానులు భారీ ప్రదర్శన నిర్వహించి కేట్ కట్ చేశారు. కార్యకర్తలు, నేతలు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఈరోజు (ఆదివారం) జగ్గారెడ్డి తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది కాబట్టి పనులు చేసుకుందామని చెప్పారు. సంగారెడ్డి ప్రజల కోసం అభివృద్ధిలో జవాబుదారీగా ఉంటానని మాటిచ్చారు. రెండు నెలల తర్వాత ప్రతి సోమవారం సంగారెడ్డిలోని రాంనగర్‌లో తన ఇంటి వద్ద అందుబాటులో ఉంటానని వివరించారు. కార్యకర్తలు ఎవరూ గాంధీ భవన్‌కు రావొద్దని వస్తే తాను కలవలేను, మాట్లాడలేనని తెలిపారు. తన కూతురికి పెళ్లి చేయాలి.. కొడుకు బిజినెస్ పెడతానని డబ్బులు అడుగుతున్నాడని చెప్పారు. అప్పులు తీర్చడానికే తన జీవితం సరిపోతుందని అన్నారు. ఈ ఇరవై ఏళ్లలో సంగారెడ్డిలో బోనాలు, దసరా ఉత్సవాల కోసం 20 కోట్ల రూపాయలు ఖర్చు చేశానని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ఎస్సై శ్రీనివాస్ మృతికి ప్రభుత్వమే కారణం

### బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రభుత్వ పని ఒత్తిడి ఉన్నతాధికారుల వేధింపులతో మృతి చెందిన "అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్" కుటుంబానికి సంతాపం తెలిపారు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ తీవ్ర పని ఒత్తిడి, ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేకనే ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతి చెందాడని దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి కోటి రూపాయలు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని వారి కుటుంబ బాధ్యత పూర్తిగా ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గాడి తప్పిన పాలనకు నిదర్శనమే ఎస్సై శ్రీనివాస్ మృతి అని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ మృతికి గల కారణాలపై న్యాయ విచారణ జరిపి బాధ్యులను గుర్తించి, బాద్యులైన పై స్థాయి అధికారులను కూడ గుర్తించి తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## జులై 15 నుంచి డిగ్రీ క్లాసులు స్టార్ట్

- మూడో విడత ఫలితాలు విడుదల
- జులై 12లోపు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచన

**విశ్వంభర, హైదరాబాద్:** డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్‌తెలంగాణ (దోస్త్) మూడో విడత సీట్ల కేటాయింపు ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం ముడో విడతలో 73,662 మంది విద్యార్థులకు సీట్లు దక్కాయి. వారిలో 9,630 మంది గత రెండు విడతల్లో సీట్లు పొందినవారు ఉన్నారు. వీరంతా మళ్లీ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకుని కొత్త కాలేజీలు, కోర్సుల కోసం ప్రయత్నించారు. ఇందుకు సంబంధించిన వివరాలను దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి వెల్లడించారు. వెబ్ ఆప్షన్లు తక్కువగా ఇచ్చినందున 6,650 మందికి సీట్లు దక్కలేదని ఆయన తెలిపారు. సీట్లు పొందినవారు జులై 7 నుంచి 11వ తేదీలోపు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీట్లను రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. రెండో విడతలో సీటు పొంది.. మళ్లీ మూడో విడతలో కొత్తగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నవారు కూడా మళ్లీ ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని దోస్త్ కన్వీనర్ స్పష్టం చేశారు. సీట్లు పొందిన విద్యార్థుల మొబైల్ ఫోన్లకు ఓటీపీ వస్తుందని, జులై 8 నుంచి 12వ తేదీ వరకు సంబంధిత కాలేజీలకు వెళ్లి, ఆ ఓటీపీ సమర్పించి తమ సీట్లను ఫైనలైజ్ చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా సీట్లు పొందిన కాలేజీల్లో రిపోర్ట్ చేయకుంటే సీట్లు కోల్పోతారని అన్నారు. దోస్త్ దరఖాస్తు, సీటు కేటాయింపు లెటర్, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్ట్, పది, ఇంటర్ మెమోలు, 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోనాఫైడ్, కుల, ఆదాయ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని ఆయన సూచించారు. ఇక తాజా ప్రక్రియతో మూడు విడతల సీట్ల కేటాయింపు పూర్తి అయినట్లైంది. దీంతో జులై 15వ తేదీ నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. మూడు విడతల్లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో ఖాళీలను బట్టి తమ కోర్సులను మార్చుకోవచ్చని దోస్త్ కన్వీనర్ లింబాద్రి సూచించారు. ఇలా కోర్సులు మార్చుకునేందుకు జులై 16 నుంచి 18వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 19న సీట్లు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.



## ముఖ్యమంత్రుల చొరవ శుభ పరిణామమే?

- భవిష్యత్ లో కూడా చర్చలు కొనసాగే అవకాశం
- ఇరు రాష్ట్రాలకు మంచి రోజులే..

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ప్రజాభవన్ లో రెండు గంటల పాటు చర్చలు జరిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి మొదటి అడుగు పడింది. రెండు కమిటీలు వేసి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఓవరాల్ గా చూస్తే ఒక్క సమస్యకూ పరిష్కారం దొరకలేదు. అలాగని ఫలితం లేదని చెప్పలేము. ఎలాంటి సమస్యలకు అయినా పరిష్కారానికి ప్రయత్నాలు జరిగితేనే ఫలితం ఉంటుంది. ఇప్పుడు ప్రయత్నాలు ప్రారంభమవడమే అసలు సక్సెస్. తమ ప్రయత్నాలపై ఇతర పార్టీలు రాజకీయం చేస్తాయని విషం చిమ్ముతాయని ఇద్దరు ముఖ్యమంత్రులకు తెలుసు. కానీ ముఖ్యమంత్రులుగా వారి బాధ్యతలపై వారికి క్లారిటీ ఉంది. అందుకే ముందుకే అడుగేశారు. నిజానికి ఇలాంటి సమస్యలు పరిష్కరించుకోవడానికి గత ఐదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఎన్నో అవకాశాలు వచ్చాయి. బేసిన్లు, భేషజాలు లేవని కేసీఆర్ చెప్పేంత సాన్నిహిత్యం నాటి ముఖ్యమంత్రుల మధ్య ఉంది. కానీ వారు కేవలం రాజకీయ ప్రయోజనాలు చూసుకున్నారు. తమ రాష్ట్ర వివాదాల్ని కోర్టులకు పంపడానికి సైతం సిద్ధపడ్డారు... కానీ ముఖాముఖి చర్చలు జరపడానికి ఆసక్తి చూపలేదు. ఏపీ నుంచి వచ్చే అంబులెన్సుల్ని ఆపినా జగన్ అడగలేకపోయారు. ఈ పరిస్థితుల నుంచి రాజకీయాలతో పాటు... రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారం కూడా ముఖ్యమేనని ఇద్దరు ముఖ్యమంత్రులు ముందడుగు వేశారు. ఓ ప్రయత్నం జరిగింది. ముందు ముందు ఎంత నిర్మాణాత్మకంగా సమస్యల పరిష్కారానికి చర్చలు జరుగుతాయన్న దానిపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. అవి కూడా ఫలితాలను ఇస్తాయని శనివారం భేటీ ఆశలు రేపింది. ఈ చర్చల నుంచి రాజకీయం పిండుకుని ప్రజల్ని రెచ్చగొట్టడానికి చాలా మంది ప్రయత్నిస్తారు. అలాంటి రాజకీయాల్ని కూడా ఈ ముఖ్యమంత్రుల్ని ఎదుర్కోవాలి.

## తిరుమల ఆదాయం 3 కోట్లు



విశ్వంభర, తిరుపతి: తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం కోసం 24 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ(TTD) అధికారులు వివరించారు.నిన్న స్వామివారిని 77,995 మంది భక్తులు దర్శించుకోగా 30,250 వేల మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.72 ఆదాయం వచ్చిందని తెలిపారు. తిరుపతి కపిలేశ్వరస్వామివారి ఆలయం (Kapileshwar Temple) లో జూలై 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం జూలై 17న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణను నిర్వహించనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు . ఇందులో భాగంగా జూలై 18న మొదటిరోజు ఉదయం ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం, సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠను నిర్వహిస్తామని వివరించారు. 19న రెండో రోజు ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలపూజ, హోమం, 20న మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామివార్లు పుర వీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇస్తారని వెల్లడించారు.

## బాయిలర్ పేలుడు.. ఇద్దరి మృతి

- ఐదుగురి పరిస్థితి విషమం
- 20 మందికి గాయాలు
- సీఎం చంద్రబాబు ఆరా



**విశ్వంభర, విజయవాడ:** ఎన్టీఆర్ జిల్లా బోదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి ఇద్దరు చనిపోయారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. దాదాపు 20 మందికి గాయాలు అయ్యాయి. కాగా ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఆదివారం జరిగిన ఘటనలో 20 మంది కార్మికులు గాయపడ్డారు. క్షతగ్రాతులు బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జగ్గయ్యపేట , విజయవాడ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సందర్భంగా ఏపీ సీఎం ఘటనపై స్పందించారు. బాధితులకు అండగా నిలబడాలని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పేలుడు ఘటనకు కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలిపారు. ప్రమాద బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కంపెనీ నుంచి పరిహారం అందేలా చూడాలని అన్నారు. ప్రభుత్వం నుంచి కూడా సాయం అందిస్తామని సీఎం పేర్కొన్నారు.

## ఇక్కడ ముగ్గురు మంత్రులు ఉన్నా ఉపయోగం లేదు: పల్లా రాజేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, ఖమ్మం :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దటూర్‌లో బలవన్మరణానికి పాల్పడిన బొజెడ్ల ప్రభాకర్ అనే రైతు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ నేతలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ మంత్రి ఇంటికి కూతవేటు దూరంలో ఆ రైతు కుటుంబం ఉంటుందని చెప్పారు. అయినప్పటికీ ఆ రైతు కుటుంబాన్ని మంత్రి పరామర్శించ లేదని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. రోజుకో రైతు బలవన్మరణానికి పాల్పడుతున్నారని చెప్పారు. అశ్వారావుపేట సీఐ వేధింపుల వల్లే ఎస్ఐ మృతి చెందారని ఆరోపించారు. ఇక్కడ ముగ్గురు మంత్రులు ఉన్నా ఉపయోగం లేదని చెప్పారు. హిట్లర్, గోబెల్స్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రైతుల కుటుంబానికి అన్యాయం చేస్తే అగ్గి పుట్టిస్తామని హెచ్చరించారు. అవినీతి డబ్బుతో ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. మాయమాటలు చెబుతూ అహంకారంతో వ్యవహరిస్తోందని చెప్పారు. పోలీసులు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

# అమెరికా అధ్యక్ష బరిలోకి కమలా హారిస్?

## బైడెన్ స్థానంలో నిలిపేందుకు పార్టీ రెడీ
## అమెరికా రాజకీయాల్లో జోరుగా చర్చ

**విశ్వంభర, ఢిల్లీః** అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు వేడి పుట్టిస్తున్నాయి. ప్రెసిడెంట్ రేసులో చివరకు నిలబడి తలపడేది ఎవరన్న అంశం ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుతానికి అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో డెమోక్రాట్ పార్టీ నుంచి ఆ దేశ ప్రస్తుత ప్రెసిడెంట్ జో బైడెన్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బరిలో నిలుస్తున్నారు. వారిద్దరూ ఎన్నికల క్యాంపైన్ కూడా మొదలుపెట్టేశారు. అయితే ఇప్పుడు ఒక్కసారిగా భారత వారసత్వ మూలాలున్న కమలా హారిస్ పేరు తెరమీదకు వచ్చింది. అధ్యక్ష ఎన్నికల బరిలో జో బైడెన్‌కు బదులు కమలా హారిస్‌ను డెమోక్రాట్ పార్టీ చివరి క్షణంలో బరిలో నిలిపే ఛాన్స్ ఉందన్న చర్చ అమెరికా మీడియా వర్గాల్లో జోరుగా సాగుతోంది. అమెరికాలో 2024 నవంబర్ 5న జరగబోయే అధ్యక్ష ఎన్నికల కోసం ఆ దేశం ఒక్కటే కాదు.. యావత్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అధ్యక్ష ఎన్నికలు ఆద్యంతం రసవత్తరంగా జరగనున్నాయి. అధ్యక్ష రేసులో భారత సంతతికి చెందిన కమలా హారిస్ ఉండే అవకాశముందన్న చర్చ నేపథ్యంలో ఇది మరింత ఆసక్తిగా మారిపోయాయి. కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ తలపడితే అగ్రరాజ్య అధ్యక్ష ఎన్నిక రసవత్తరంగా మారే అవకాశముంది. భారతీయ మూలాలతో పాటు నల్లజాతీయురాలైన కమల హారిస్‌ను డెమోక్రాట్ అభ్యర్థిగా ప్రకటిస్తే.. ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో బాగా కలిసొస్తుందని కొందరు రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో అధ్యక్షుడు బైడెన్ తడబడగా.. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పైచేయి సాధించారు. బైడెన్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారని.. ఆయన అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని రిపబ్లికన్లు సలహా ఇస్తున్నారు. డెమొక్రాటిక్ పార్టీ నుంచి బైడెన్‌కు బదులు మరో వ్యక్తికి అవకాశం ఇస్తే మంచిదని సొంత పార్టీ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. దీంతో బైడెన్‌కు బదులు కమలా హారిస్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా ప్రెసిడెంట్ రేసులో నిలిచే అవకాశముందని జోరుగా ప్రచారం జరుగుతోంది. అధ్యక్ష బరిలో తానే ఉంటానని బైడెన్ చెబుతున్నా.. ఏ క్షణంలోనైనా ఈ విషయంలో మార్పు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. బైడెన్ అధ్యక్ష బరిలో నుంచి వైదొలగితే.. ప్రస్తుతం ఆ దేశ ఉపాధ్యక్షురాలిగా ఉన్న కమలా హారిస్‌కు ఆ అవకాశం దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే.. యావత్ ప్రపంచం చూపు కమలా హారిస్ వైపు చూస్తోంది. మరీ ముఖ్యంగా కమలా హారస్ అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచే అవకాశముందన్న కథనాలతో.. ఇటు భారత్‌లోనూ అమెరికా ప్రెసిడెంట్ ఎన్నికలపై ఆసక్తి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీనికి కారణం.. ద మోస్ట్ పవర్ ఫుల్ ఉమెన్ కమలా హారిస్ మన భారతీయ మూలాలున్న మహిళ కావడమే. సూపర్ పవర్ అమెరికాకు భారత సంతతికి చెందిన ఓ మహిళ అధ్యక్ష పీఠానికి చేరువ కావడం 130 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమే. మూడున్నరేళ్ల క్రితం ఆమె అమెరికా వైస్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు కూడా భారతీయ హృదయం ఎంతో గర్వంతో పొంగిపోయింది. ఇప్పుడు అధ్యక్ష పీఠానికి దగ్గర కావడంతో ఇప్పుడు భారతీయులందరూ ఆమె వైపే చూస్తున్నారు. యూఎస్ రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు ఏ మహిళ ప్రెసిడెంట్ పీఠాన్ని అధిష్టించలేదు. అమెరికా చరిత్రలో వైస్ ప్రెసిడెండ్ పీఠాన్ని అధిష్టించిన తొలి మహిళ కమలా హారిస్. 1984లో డెమొక్రాట్ జెరాల్డిన్ ఫెరారో, 2008లో రిపబ్లికన్ సారా పాలిన్ ఉపాధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచినా.. పార్టీల ఓటమి కారణంగా వారు విజయాన్ని సొంతం చేసుకోలేకపోయారు. 2020 ఉపాధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ సాధించిన విజయం అంత ఈజీగా అయ్యింది కాదు. ఎన్ని ఆటంకాలు, విమర్శలు ఎదురైనా.. తన ప్రతిభతో సూపర్ పవర్ దేశానికి వైస్ ప్రెసిడెంట్ అయ్యారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిన కమలా హారిసే నెక్స్ట్ టైం అధ్యక్ష అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశం ఉందంటూ కొందరు విశ్లేషకులు అప్పట్లోనే జోస్యం చెప్పారు. ఇప్పుడు డెమొక్రాటిక్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా కమలా పేరు ఖరారు అయితే.. డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీ ఖాయమని ఆ దేశ మీడియా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



### కమలా హారిస్ భారత మూలాలు..

**కమలా హ్యారిస్‌కు భారతీయ-జమైకా వారసత్వ మూలాలు ఉన్నాయి. కమల తల్లి శ్యామలా గోపాలన్ స్వస్థలం చెన్నై. న్యూట్రిషనిస్ట్ అయిన శ్యామలా గోపాలన్ ఎండోక్రైనాలాజిలో రీసెర్చ్ కోసం అమెరికా వెళ్లినప్పుడు యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పరిచయమైన డొనాల్డ్ హారిస్‌ను పెళ్లి చేసుకోని అక్కడే స్థిరపడ్డారు. డొనాల్డ్ హారిస్ జమైకా మూలాలున్న వ్యక్తి. వారికి 1964 అక్టోబర్ 20న జన్మించిన కమల.. లాయర్‌గా కొనసాగారు. 2003లో శాన్‌ఫ్రాన్సిస్కో జిల్లా అటార్నీగా విజయం సాధించారు. 2016లో కాలిఫోర్నియా నుంచి పోటీ చేసి సెనేటర్‌గా ఎంపికయ్యారు. 2020లో అమెరికా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.**



## చార్ థామ్ యాత్ర వాయిదా

- ఉత్తరాఖండ్ లో భారీ వర్షా లు
- పోటెత్తుతున్న వరదలు

**విశ్వంభర, ఢిల్లీః** ఉత్తరాఖండ్ ను భారీ వర్షాలు ముంచెత్తుతుండటం, ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. గర్వాల్ ప్రాంతంలో ఆది, సోమవారాల్లో భారీ నుంచి అతి భారీ స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో చార్‌థామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు గార్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. వాతావరణ పరిస్థితి చక్కబడే వరకూ యాత్రికులు వేచిచూడాలని, ఎక్కడున్న వారు అక్కడే ఉండాలని సూచించారు. కాగా, గత కొద్ది రోజులుగా ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నారు. దీంతో బద్రీనాథ్ వెళ్లే హైవేపై రాకపోకలపై అధికారులు ఆంక్షలు విధించారు. శనివారంనాడు కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ నుంచి బైక్‌పై తిరిగి వస్తున్న హైదరాబాద్‌కు చెదిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కర్ణప్రయాగ, గౌచర్ మధ్య ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదేరోజు ఉత్తరాఖండ్‌లని రామనగర్ వద్ద వర్షాల ఉధృతికి ఒక వంతెన కుప్పకూలింది. జోషిమఠ్ సమీపంలోని విష్ణు ప్రయాగ్ వద్ద నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహస్తున్నట్టు అధికారులు ప్రకటంచారు. ఐఎండీ రెడ్ అలర్ట్ నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



## అస్సాంలో వరద విలయం..
## 70మంది మృతి

**విశ్వంభర, అస్సాం:** ఈశాన్య రాష్ట్రం అస్సాంలో వరదల బీభత్సం కొనసాగుతుంది. నదులు ఉప్పొంగుతున్నాయి. బ్రహ్మపుత్ర నది.. దాని ఉపనదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అస్సాంలోని 30 జిల్లాల్లో భారీ వరదల కారణంగా 24లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 70 మంది మరణించారు. వందకుపైగా వణ్యప్రాణులు మృతిచెందగా.. 15.50లక్షల ప్రాణులపై వరద ప్రభావం పడింది. వరదలతో 125 రోడ్లు దెబ్బతినగా.. పలు వంతెనలుసైతం దెబ్బతిన్నాయి. వరదల్లో చిక్కుకున్న వారిని రెస్క్యూ టీం సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 577 సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి..55వేల మందిని శిబిరాలకు తరలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు, ఆహారాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఏకదాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలో నదులన్నీ ఉప్పొంగుతున్నాయి. బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. వరదలతో పంట పొలాలు దెబ్బతిన్నాయి. 70వేల హెక్టార్లలో పంటభూమి నీట మునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఏరియల్ సర్వే నిర్వహించారు. వరద పరిస్థితిపై అస్సాం సీఎంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. వరద తలెత్తిన ఇబ్బందులు, ఏఏ రంగాలకు ఎంతమేర నష్టం వాటిల్లింది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి కావాల్సిన సహకారం అందిస్తామని అమిత్ షా అస్సాం ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. అస్సాంలో వరదల బీభత్సంపై లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. అస్సాం రాష్ట్రంకు కేంద్రం వెంటనే వరద సహాయం అందించాలని కోరారు.

## నాసా హెచ్చరిక..
## భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలం

**విశ్వంభర, నాసా:** అంతరిక్షంలో తిరిగే గ్రహశకలం ఒకటి భూమి వైపుకు దూసుకొస్తోందని నాసా హెచ్చరించింది. ఈ గ్రహశకలం గంటకు 65వేల కిలో మీటర్ల వేగంతో పయనిస్తుందని.. మరో రెండు రోజుల్లో భూమికి సమీపంలో వెళ్తుందని నాసా తెలిపింది. ఈ గ్రహశకలంతో భూమికి ఏమైనా ప్రమాదం ఉందా.. గ్రహశకలం నుంచి ఎదురయ్యే ముప్పును తప్పించడం సాధ్యమవుతుందా.. అసలు నాసా ఏం చెబుతుందనే వివరాల్లోకి వెళ్లితే..గ్రహశకలం 2024 ఎంటీ1 కు సంబంధించి నాసా హెచ్చరిక జారీ చేసింది. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ పరిమాణంలో సుమారు 260 అడుగులు ఉన్న ఈ గ్రహశకలం భూమివైపు దూసుకొస్తుందని తెలిపింది. ఇది గంటకు సుమారు 65,215 కిలో మీటర్ల వేగంతో భూమివైపు దూసుకొస్తుందని వెల్లడించింది. ఇది జూలై 8వ తేదీ నాటికి భూమికి అతి సమీపంలోకి వస్తుందని నాసా స్పష్టం చేసింది. 2024 ఎంటీ1 గ్రహశకలం భూమివైపుకు దూసుకొస్తున్న విషయాన్ని భూమికి దగ్గరగా వచ్చే గ్రహశకలాలు, తోకచుక్కలను ట్రాక్ చేసే నియర్‌ఎర్త్ ఆబ్జెక్ట్ ద్వారా కనుగొన్నట్లు నాసా తెలిపింది. ఈ ఆస్టరాయిడ్స్ గంటకు 65వేలకుపైగా వేగంతో దూసుకొస్తున్నప్పటికీ ఇప్పుడు భూమికి ఎలాంటి ప్రమాదం లేదని నాసా తెలిపింది. గ్రహశకలం భూమి నుంచి సుమారు 1.5 మిలియన్ కిలో మీటర్ల దూరంలో వెళ్తుంది. ఇది భూమి, చంద్రుడి మధ్య దూరంకంటే నాలుగు రెట్లు ఎక్కువ. అయితే ఈ పరిమాణంలో ఉన్న గ్రహశకలాలు భూమిని ఢీకుంటే జరిగే నష్టం ఎక్కువగా ఉంటుందని నాసా తెలిపింది. 2024 ఎంటీ1 వంటి గ్రహశకలం ప్రభావం భారీ పేలుళ్లు, సునామీతో జరిగే నష్టానికి సమానమని, అయితే, నాసా ప్లానెటరీ డిఫెన్స్ కోఆర్డినేషన్ ఆఫీస్ అలాంటి ప్రమాదాలను నియంత్రించేందుకు పనిచేస్తుందని నాసా వెల్లడించింది. డబుల్ ఆస్టరాయిడ్ రీ డైరెక్షన్ టెస్ట్ మిషన్ వ్యోమనౌకను క్రాస్ చేయడం ద్వారా గ్రహశకలాన్ని మళ్లించే సాధ్యాసాధ్యాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు నాసా తెలిపింది. అయితే.. ఇది 2024 ఎంటీ1కి సంబంధించినది కాకపోయినప్పటికీ గ్రహశకలాల డైవర్షన్ లో ఓ ముందడుగు సాధించినట్లు నాసా తెలిపింది. అయితే, 2024 ఎంటీ1 భూమికి చేరువగా వెళ్తున్నందున దాని చిత్రాలు, డేటాను తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి.



## 50 మందిని పెళ్లి చేసుకున్న మహిళ

**విశ్వంభర, చెన్నైః** ఇప్పటి వరకు నిత్య పెళ్లి కొడుకులనే చూశారు కదా.. ఇప్పుడు మనం నిత్య పెళ్లి కూతురు గురించి చెప్పుకోబోతున్నాం. ఆమె ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 50 మందిని పెళ్లాడింది. అయితే, ఈ నిత్య పెళ్లి కూతురు వ్యవహారాన్ని ఆమె ఆధార్ కార్డ్ బహిర్గతం చేసింది. చివరకు ఆమె జైల్లో ఊచలు లెక్కిస్తోంది. ఈ నిత్య పెళ్లికూతురు ఎవరు? ఆమె వ్యవహారం ఎలా బయటపడింది? అసలు ఈ ఘటన ఎక్కడ జరిగింది? పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. తమిళనాడులోని తిరుపూర్ జిల్లా తారాపురానికి చెందిన ఓ యువకుడు బేకరిలో పని చేస్తున్నాడు. అతనికి 35 ఏళ్లు నిండినా.. పెళ్లి కాకపోవడంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'అంబి డేట్ ద తమిళ్ వే'లో రిజిస్టర్ చేసుకున్నాడు. ఈ వెబ్‌సైట్‌లోనే సంధ్య అనే మహిళ పరిచయమైంది. ఈరోడ్ జిల్లా కొడుమూడికి చెందిన సంధ్య తన వయసు 30 అని.. యువకుడిని పెళ్లి చేసుకునేందుకు అంగీకరించింది. ఇద్దరూ కొంతకాలం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో చాటింగ్ చేసుకున్నారు. ఆమెకు అవసరమైనప్పుడల్లా యువకుడు డబ్బులు పంపించేవాడు. ఈ క్రమంలో ఓ రోజు పళని సమీపంలోని ఓ దేవాలయంలో సంధ్య, యువకుడు పెళ్లి చేసుకున్నారు. అబ్బాయి తల్లిదండ్రులు కూడా వారి పెళ్లికి అంగీకరించారు. అంతేకాదు.. పెళ్లి కూతురుకు కావాల్సిన నగలు, పట్టు చీరలన్నీ పెళ్లి కొడుకు కుటుంబమే కొనుగోలు చేసింది.

**బాబోయ్ అంత మందిని పెళ్లి చేసుకుందాం..**

పోలీసుల విచారణలో ఆ మహిళకి సంబంధించి సంచలన విషయాలు బహిర్గతమయ్యాయి. ఆమెకు పదేళ్ల క్రితమే ఒకసారి వివాహమైందని.. ఆమెకు ఒక బిడ్డ కూడా ఉందని గుర్తించారు. అంతేకాదు.. అతని నుంచి విడిపోయిన మహిళ.. వ్యాపారవేత్తలు, ఫైనాన్షియర్స్, పోలీసు అధికారులు సహా మొత్తం 50 మందిని ఆమె పెళ్లి చేసుకుని మోసం చేసినట్లు గుర్తించారు. పెళ్లి చేసుకోవడం.. కొద్ది నెలల కాపురం తరువాత గొడవపడి నగలు, నగదులో ఇంటినుంచి పారిపోయేది. సంధ్య బాధితుల్లో పోలీసు ఉన్నతాధికారులు సైతం ఉన్నారని తెలిసింది. ఒక డీఎస్పీ, పలువురు ఎస్ఐలను కూడా సంధ్య పెళ్లి చేసుకుని మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. చాలా ఈ పరిస్థితిని బయటకు చెప్పుకోలేకపోవడంతో సంధ్య యధేచ్ఛగా తన మోసాల పరంపరను కొనసాగిస్తూ వస్తోంది. కానీ, తాజాగా ఆమె గుట్టు రట్టవడంతో పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



### ఇలా బయటపడింది..

**పెళ్లైంది. హ్యాపీగా 3 నెలలు గడిచింది. అయితే, ఆమె ప్రవర్తనలో స్వల్పంగా మార్పులు మొదలయ్యాయి. ముఖ్యంగా సంధ్య చెప్పిన వయసుకు, ఆమె రూపు రేఖలకు పొంతన లేదు. దీంతో ఆమె ఆధార్ కార్డ్‌ను చెక్ చేశాడు. ఆ కార్డులో భర్త పేరుగా చెన్నైకి చెందిన మరో వ్యక్తి పేరు ఉంది. దీంతో షాక్ అయిన యువకుడు.. వెంటనే ఆమెను నిలదీశాడు. దొరికిపోయానని గుర్తించిన మహిళ.. తన భర్తను, అతని కుటుంబ సభ్యులను భయబ్రాంతులకు గురి చేసింది. చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడింది. వెంటనే యువకుడు తారాపురంలోని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు గుట్టంతా రట్టయ్యింది.**

## భారత్ అభ్యంతరాలను పట్టించుకోని శ్రీలంక
### విదేశీ రిసెర్చ్ షిప్పై నిషేధం ఎత్తివేతకు నిర్ణయం



**విశ్వంభర, ఢిల్లీః** చైనా నిఘా నౌకలపై భారత్ అభ్యంతరాలు, ఆందోళనలను శ్రీలంక పక్కకు పెడుతోంది. విదేశీ రిసెర్చ్ షిప్స్‌పై నిషేధం ఎత్తివేతకు నిర్ణయించింది. జపాన్‌ను సందర్శించిన శ్రీలంక విదేశాంగ మంత్రి అలీ సబ్రీ, ఆ దేశ మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. వివిధ దేశాలకు వేర్వేరు నిబంధనలను తమ ప్రభుత్వం అనుమతించదని తెలిపారు. ఈ నేపథ్యంలో చైనా నౌకలను మాత్రమే అడ్డుకోలేమని సబ్రీ అన్నారు. ఇతర దేశాల మధ్య వివాదాలతో తమ దేశానికి సంబంధం లేదన్నారు. మారటోరియం వచ్చే ఏడాది జనవరి వరకు ఉంటుందని, ఆ తర్వాత విదేశీ పరిశోధన నౌకలను శ్రీలంక నిషేధించబోదని సబ్రీ చెప్పారు. కాగా, 2023 నవంబర్ వరకు చైనాకు చెందిన రెండు నిఘా నౌకలు శ్రీలంక పోర్టుల్లో ఉన్నాయి. దీనిపై భారత్, అమెరికా ఆందోళన వ్యక్తం చేశాయి. శ్రీలంక నౌకాశ్రయాల వద్ద అలాంటి నౌకలను అనుమతించవద్దని కోరాయి. దీంతో ఈ ఏడాది జనవరిలో విదేశీ పరిశోధన నౌకల ప్రవేశాన్ని శ్రీలంక నిషేధించింది. అయితే ఒక చైనా నౌకకు మినహాయింపు ఇచ్చింది. మరోవైపు వచ్చే ఏడాది నుంచి విదేశీ రిసెర్చ్ షిప్స్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలని శ్రీలంక నిర్ణయించింది.

## అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని గుర్తుచేస్తూ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, అహ్మదాబాద్ :** అయోధ్యలో రామమందిర నిర్మాణం, ప్రారంభోత్సవాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆయన కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడారు. రామమందిర ప్రారంభోత్సవంలో పారిశ్రామిక వేత్తలు అదానీ, అంబానీ కనపడ్డారని, కానీ ఒక్క పేదవాడూ కనపడలేదని అన్నారు. దీనిపై తాను ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. అయోధ్య విమానాశ్రయ నిర్మాణంతో అక్కడి రైతులు తమ భూములను కూడా కోల్పోయారని తెలిపారు. అయోధ్య నుంచి కూడా ఎవరినీ రామమందిర ప్రారంభోత్సవానికి పిలవలేదని అక్కడి ప్రజలు నిరాశ చెందారని చెప్పారు. అయోధ్యలో ఉద్యమాన్ని అద్వాణీ ప్రారంభించారని, అక్కడ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిచిందని రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ తమ ఆఫీసుని ఎలా కూల్చివేసిందో తాము అలాగే ఆ ప్రభుత్వాన్ని కూల్చనున్నామని చెప్పారు. కానీ, గుజరాత్ కాంగ్రెస్ లో కొన్ని లోపాలు ఉన్నాయని అన్నారు. 2022 గుజరాత్ ఎన్నికల్లో బీజేపీపై సరిగ్గా పోటీచేయలేకపోయామని చెప్పారు. 2017లో ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచి బాగా పనిచేశామని, ఫలితాలు బాగా వచ్చాయని తెలిపారు. ఇప్పుడు 2027 ఎన్నికలకు మరో మూడేళ్ల సమయం ఉందని అన్నారు. రేసు ఎక్కడ ఆపామో అక్కడి నుంచే మొదలు పెట్టాలని, గుజరాత్ లో 30 ఏళ్ల తర్వాత మళ్లీ 2027లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. తాను, తన సోదరితో పాటు పార్టీ నాయకత్వం అంతా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు మద్దతుగా ఉంటుందని అన్నారు.



# తెగని పంచాయితీ!

- చంద్రబాబు, రేవంత్ మీటింగ్ సక్సెస్ కానట్టే
- ఉమ్మడి ఆస్తుల పంపకాలకు బ్రేక్
- ఆ ఐదు గ్రామాల విలీనానికి నో



**విశ్వంభర, హైదరాబాద్:** రెండు తెలుగు రాష్ట్రాల నడుమ తెగని పంచాయితీలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా విభజన చట్టంలోని సమస్యలు అన్నీ అలాగే ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని గతంలో కేసీఆర్, చంద్రబాబు భేటీ అయ్యారు. కానీ సక్సెస్ కాలేదు. ఆ తర్వాత కేసీఆర్, జగన్ కూడా భేటీ అయ్యారు. వీరిద్దరూ ఒకరికి ఒకరు రాజకీయంగా ఎంతో సన్నిహిత్యంగా ఉన్నారు కాబట్టి.. ఎంతో కొంత సమస్యలు పరిష్కారం అవుతాయని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. వారిద్దరి మధ్య కూడా విభజన సమస్యలు కొలిక్కి రాలేదు. ఎందుకంటే వ్యక్తిగతంగా వీరిద్దరికీ మంచి సన్నిహిత్యం ఉండచ్చు. కానీ రాజకీయంగా మాత్రం ఎవరి ఒత్తిడిలు వారికి ఉన్నాయి. తెలంగాణ నుంచి ఒక్క రూపాయి ఆంధ్రాకు ఇచ్చినా తెలంగాణ ప్రజల దృష్టిలో కేసీఆర్ మీద వ్యతిరేకత వస్తుంది. అలాగే ఆంధ్రా నుంచి ఒక్క రూపాయి తెలంగాణకు ఇచ్చినా ఆంధ్రా ప్రజల దృష్టిలో జగన్ మీద వ్యతిరేకత ఖాయం. అందుకే అప్పుడు అవి తెగలేదు. అయితే ఇప్పుడు చంద్రబాబు, రేవంత్ లు సీఎంలుగా ఉన్నారు కాబట్టి ఏమైనా సమస్యలు తెగుతాయేమో అని అంతా అనుకున్నారు. ఎందుకంటే వీరిద్దరూ గురు, శిష్యులుగా ఎంతో సన్నిహిత్యం ఉన్నవారు. పైగా చంద్రబాబు మాటను రేవంత్ కాదనలేడేమో అని అంతా అనుకున్నారు. కాబట్టి కొన్ని సమస్యలకు అయినా పరిష్కారం దొరుకుతుందని అనుకున్నారు. కానీ ఏ ఒక్క సమస్యలకు కూడా పరిష్కారం దక్కలేదు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిసిన ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని రేవంత్ కోరారు. కానీ అది తన చేతిలో లేదని చంద్రబాబు చెప్పారు. కేంద్రం చేతిలోనే ఉందని చెప్పి తన మీద భారం లేకుండా చూసుకున్నారు. ఇక తెలంగాణలో ఉన్న ఉమ్మడి బిల్డింగులను కొన్నింటిని తమకు అప్పజెప్పాలని చంద్రబాబు ప్రభుత్వం కోరింది. కానీ దానికి రేవంత్ ప్రభుత్వం తిరస్కరించింది. హైదరాబాద్ లో ఉన్న ఉమ్మడి ఆస్తుల విషయంలో కూడా రేవంత్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదు. అంటే మొత్తంగా చూసుకుంటే చంద్రబాబు అడిగిన వాటికి రేవంత్ రెడ్డి.. రేవంత్ అడిగిన వాటికి చంద్రబాబు ఒప్పుకోలేదు. కాబట్టి ఈ పంచాయితీ ఇంకా తెగట్లేదు. ఇప్పట్లో చూస్తే ఈ పంచాయితీ తెగే విధంగా కూడా కనిపించట్లేదు. ఎందుకంటే ఇవి చాలా సున్నితమైన అంశాలు. ఏ ఒక్కటి అటు పోయినా.. ఏ ఒక్కటి ఇటు రాకపోయినా సరే ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహాలు వ్యక్తం అవుతాయి. కాబట్టి వాటికి చంద్రబాబు, రేవంత్ గురి కావాల్సి వస్తుంది. అందుకే ఈ సమస్యలు చాలా జఠిలమైనవిగా చెబుతున్నారు. వీరి హయాంలోనే అవి పరిష్కారం కాలేదంటే.. ఇక భవిష్యత్ లో కూడా కావేమో అంటున్నారు.

## టీడీపీ నేత వర్మకు సముచిత ప్రాధాన్యం ఇస్తారా?

- పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన నేత
- జనసేన గెలుపుకు ఆయన చొరవకు ప్రత్యేక గుర్తింపు
- నామినేటెడ్ పదవి ఇచ్చేందుకు సన్నాహాలు?



**విశ్వంభర, పిఠాపురం:** ఆయన పిఠాపురంలో మంచి పేరున్న నేత. నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల్లో మంచి నేతగాపేరు తెచ్చుకున్నారు. నిత్యం ప్రజలతో మమేకమయ్యారు. సీటు తనదే అని అనుకున్నారు. కానీ అలయెన్స్ లో భాగంగా అక్కడ నుంచి పోటీ చేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ భావించారు. తన గెలుపుకు అన్ని విధాలా సరిపోతుందని ఆలోచించారు. దీంతో పిఠాపురం సీటు ఇవ్వాలని పట్టుబట్టారు. ఇక ఇక్కడ తాను పోటీ చేస్తానని భావించుకున్న పవన్ తన కోరికను వెల్లడించడంతో ఇక చేసేది లేక వర్మ కూడా తన సీటును త్యాగం చేశారు. ఫలితంగా పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. దీంతో వర్మకు కూడా సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఇద్దరు నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నారు. అతడికి నామినేటెడ్ పదవి ఇవ్వాలని యోచిస్తున్నారు. ఇప్పటికే క్షత్రియులకు ఎలాంటి ప్రాతినిధ్యం లేకపోవడంతో వర్మ సేవలు గుర్తించి వారికి సరైన పదవి ఇవ్వాలని ఇరువురునేతలు ఆలోచిస్తున్నారు. తమ గెలుపుకు తన పదవిని త్యాగం చేసిన వర్మ సేవలను గుర్తిస్తామని చెబుతున్నారు. కార్పొరేషన్లలో రాష్ట్ర వ్యాప్త పదవి కట్టబెట్టి తమ రుణం తీర్చుకోవాలని చూస్తున్నారు. రాజకీయంగా అన్ని కులాలకు సరైన గుర్తింపు ఇచ్చే టీడీపీ క్షత్రియులకు కూడా తగిన గౌరవం ఇవ్వాలనే ఆలోచనలో భాగంగా వర్మకు మంచి పదవి ఇవ్వాలని అనుకుంటున్నట్లు సమాచారం. వర్మకు ఎలాంటి పదవి ఇస్తారో వేచిచూడాల్సిందే.

## అమరావతి డెవలప్‌మెంట్‌కు కేంద్రం సుముఖం?

- కార్యాచరణకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
- ఎన్నికల హామీల అమలుకు రెడీ
- కార్య నిర్వహణకు అంతా సిద్ధం?

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో రాజధాని అమరావతికి మంచి రోజులొస్తున్నాయి. కేంద్రంలో కూడా టీడీపీ, జనసేన పార్టీల మద్దతుతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడటం అమరావతికి కలసి వస్తోంది. కొద్దిరోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రధాని నరేంద్ర మోదీని, ఆరుగురు కేంద్ర మంత్రులను కలిసి ఏపీ అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చే శారు. అలాగే ఆర్థిక సంఘం చైర్మన్, నీతిఆయోగ్ సీఈవోలతోనూ చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతి రింగు రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ హైవేలకు ఆయా మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులు పొందారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ, ప్రధానమంత్రి తుది ఆమోదం లభిస్తే అమరావతి రింగు రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ హైవేల పనులు ప్రారంభమవుతాయి. అమరావతి ఔటర్ రింగు రోడ్డుకు భూసేకరణ సహా పనులకు మొత్తం రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వ్యయానికి సంబంధించిన అలాగే విజయవాడలో రద్దీని తగ్గించడానికి ఉద్దేశించిన విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులు.. అమరావతి – హైదరాబాద్ మధ్య ఇప్పుడున్న దూరాన్ని 60-70 కి.మీ. తగ్గించడానికి ఆరు వరుసల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ నుంచి మేదరమెట్ల వరకు తలపెట్టిన ఎక్స్‌ప్రెస్ వేని అమరావతితో అనుసంధానిస్తూ... మేదరమెట్ల-అమరావతి మధ్య 90 కి.మీ. పొడవైన గ్రీన్ ఫీల్డ్ హైవేని నిర్మించాలన్న ప్రతిపాదనకు కూడా కేంద్రం సమ్మతించింది. కాగా ఓఆర్ఆర్ ని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సీఆర్‌డీఏ పరిధిలో 189 కి.మీ. మేర ఆరు వరుసలతో నిర్మించనున్నారు. దీనికి అన్ని ఖర్చులు కలిపి రూ.30 వేల కోట్ల వరకు అవసరమవుతాయని అంటున్నారు. ఓఆర్ఆర్ సహా ఈ రహదారుల నిర్మాణం మొదలైతే... రెండు మూడేళ్లలోనే రాజధాని అమరావతి సమగ్రంగా అభివృద్ధి చెందుతుందనే అంచనాలు ఉన్నాయి.

## హత్యలు చేస్తేనే జగన్ కు మనుగడ

**బీటెక్ రవి సంచలన వ్యాఖ్యలు**

విశ్వంభర, పులివెందుల: హత్యలు చేయడం వల్లే ఈ రోజు పులివెందుల రాజకీయాల్లో వైఎస్ కుటుంబం మనగడ కొనసాగుతోందని తెలుగుదేశం పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి (BTech Ravi) ఆరోపించారు. వాళ్ల రాజకీయ పునాదే ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పుట్టిందని విమర్శించారు. పులివెందులలో బీటెక్ రవి ఈరోజు(ఆదివారం) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంపల్లిలో యువకుడిపై జరిగిన దాడి ఘర్షణ గురించి మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడిన మాటలు చాలా హాస్యాస్పదగా ఉన్నాయని అన్నారు. నేరచరిత్రే తెలియదన్నట్టుగా వారు మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు.



ఎన్నికల్లో ఏజెంట్లుగా టీడీపీ వాళ్లను కూర్చోవద్దని బెదిరించలేదా అని ప్రశ్నించారు. అయినా తమ ఏజెంట్లు ఆ రోజు కూర్చున్నారని వారిని చొక్కాలు చించి కొట్టారని మండిపడ్డారు. తన్నులు తిన్న యువకుడే తమ ఏజెంట్లను కొట్టారని.. ఆ యాక్షన్ కు ప్రతి రియాక్షన్ తప్ప మరొకటి కాదని చెప్పారు. అసలు ఇలాంటి సాంప్రదాయం పులివెందులలోనే లేదని జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నగరిగుట్టకు చెందిన ఇద్దరు యువకులను చంపి బ్రిడ్జి కింద దాచి పెట్టలేదా అని ప్రశ్నించారు. హత్యలు చేశాకా జగన్, వైసీపీ నేతలను పులివెందులలో ఉండొద్దనడం వల్ల అప్పటికప్పుడు బెంగళూరు పారిపోయారని ఎద్దేవా చేశారు. మొన్న వేంపల్లి దగ్గర దాడి మాత్రమే జరిగిందని.. ఐలాపురం దగ్గర హత్యలు జరిగాయని చెప్పారు. వేముల ఘటనలో గన్‌మెన్ తుపాకీతో సతీష్ రెడ్డి కాల్పులు జరిపి ప్రాణరక్షణ కోసం గన్‌మెన్ కాల్పు లు జరిపాడని వైసీపీ నేత సతీష్ రెడ్డి అబద్ధాలు ఆడారన్నారు. ఇదే కేసు ఇప్పటికి నడుస్తోందని గుర్తుచేశారు. అహింస మార్గమే తమకు తెలియదన్నట్టుగా జగన్ మాట్లాడటం కరెక్ట్ కాదన్నారు. దాడి జరిగిందని ఆ పిల్లోడిని పెట్టుకొని మాట్లాడితే రాజకీయ లబ్ధి వస్తుందని ఆలోచించడం తెలివి తక్కువతనమని బీటెక్ రవి పేర్కొన్నారు.

# జగన్ వార్నింగ్.. దాడులు ఆగుతాయా?

- కూటమి నేతల దూకుడు
- వైసీపీ నేతల్లో ఆందోళన
- కక్ష పూరిత చర్యలు తాము చేయబోమంటున్న పవన్
- కూటమి నేతలను చంద్రబాబు కట్టడి చేస్తారా



**విశ్వంభర, అమరావతి:** ఇప్పటికే ఏపీలో వైసీపీ నేతలపై దాడులు క్రమంగా జరుగుతూనే ఉన్నాయని ఆ పార్టీ నేతలు పదే పదే ఆరోపిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి నెల గడవకముందే.. అప్పుడే తమ మీద ప్రతీకార చర్యలు ఎక్కువ అవుతున్నాయంటున్నారు. ఇక రాబోయే రోజుల్లో అసలు బతకనిస్తారో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతెందుకు ఫలితాలు వచ్చిన తెల్లారే కొడాలి నాని, రోజా, అనిల్ కుమార్, అంబటి రాంబాబు లాంటి వారి ఇండ్ల ముందు దారుణంగా టీడీపీ నేతలు ఆందోళనలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. వారి ఇండ్ల మీదకు రాళ్లు, గుడ్లు కూడా విసిరారు. అందుకు సంబంధించిన వీడియోలు కూడా ఎంతగా వైరల్ అయ్యాయో చూశాం. అయితే ఈ దాడులపై జగన్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే వస్తున్నారు. ఇన్ని రోజులు ట్విట్టర్ లో మాట్లాడిన ఆయన.. నిన్న నేరుగా మీడియా ముందుకు వచ్చారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జైలుకు వెళ్లి కలిశారు జగన్. బయటకు వచ్చి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. టీడీపీ అరాచకాలు, గొడవలు రోజురోజుకూ పెరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ గొడవలు గనక ఆపకపోతే మాత్రం మీకు కూడా ఇదే గతి పడుతుందని చెప్పుకొచ్చారు మాజీ సీఎం జగన్. అయతే జగన్ ఈ స్థాయిలో వార్నింగ్ ఇవ్వడానికి కారణం కూడా ఉంది. ఎందుకంటే జగన్ ను నమ్ముకుని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భీకరంగా పోరాడుతున్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడి వెళ్లట్లేదు. అందుకే ఇప్పుడు జగన్ వారికోసం ఈ స్థాయిలో వార్నింగ్ ఇవ్వాల్సి వస్తుంది. సహనం కోల్పోతే జరిగేది అనర్థమే. కానీ ఆ సహనాన్ని పదే పదే పరీక్షిస్తే ఎవరైనా ఏం చేస్తారు.. తిరగబడతారు అనే విషయాన్ని ఇక్కడ జగన్ గుర్తు చేస్తున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే తాము అడ్డురామని.. కానీ అన్యాయం చేయాలని చూస్తే మాత్రం కచ్చితంగా అడ్డుకుంటామని చెబుతున్నారు జగన్. ఇదే ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అవుతోంది. ఏపీ రాజకీయాలు అంటేనే బయట రాష్ట్రాల్లో అదో రకమైన చర్చ నడుస్తోంది. అలాంటిది ఇప్పుడు ఇదే కంటిన్యూ చేస్తామంటే మాత్రం అది చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి పెద్ద మచ్చ తీసుకొస్తుందని అంటున్నారు కూటమి కార్యకర్తలు. మరి ఇదే కక్షపూరిత చర్యలకు పాల్పడితే మాత్రం అది అంతిమంగా జగన్ కే సానుభూతిగా మారుతుంది. అంతే గానీ.. చంద్రబాబు ఇమేజ్ మాత్రం పెరగదని భావిస్తున్నారు జనసేన నేతలు. చూడాలి మరి జగన్ వార్నింగ్ తో వెనక్కు తగ్గుతారా లేదంటే ఇంకా కొనసాగిస్తారా అనేది.

## ఆంధ్రప్రదేశ్ పై ప్రత్యేక ఫోకస్?

- భారీ నజరానా ప్రకటించిన ప్రధాని
- ఎన్నికల హామీల అమలుకు రెడీ
- ఏపీ పరిస్థితి మారేనా?



**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటన చేసిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కేంద్ర పెద్దలకు వివరించి సహాయం కోరడంతోపాటు కొన్ని ప్రాజెక్టులను కూడా సాధించుకొచ్చారు. అందులో భాగంగా రాష్ట్రంలో తొమ్మిది నెలల నుంచి తాత్కాలికంగా నిలిచిపోయిన ఎనిమిది జాతీయ రహదారుల విస్తరణకు మోక్షం కలిగింది. పనులు ప్రారంభించాలంటూ కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా ఆయన అంగీకరించారు. త్వరలోనే పనులు ప్రారంభం కాబోతున్నాయి. దేశవ్యాప్తంగా రూ.రెండు లక్షల కోట్లతో భారత్ మాల పరియోజన పథకం కింద జాతీయ రహదారులను విస్తరిస్తున్నారు. బడ్జెట్ కు మించి పనులు మంజూరు కావడంతో గతేడాది నవంబరు నుంచి వీటిని తాత్కలికంగా నిలిపివేశారు. ఇలా ఆగిపోయినవాటిల్లో మన రాష్ట్రానికి చెందిన ఎనిమిది రహదారులున్నాయి. వీటి విస్తరణ పనుల విలువ రూ.8243 కోట్లు. మరోసారి చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ రహదారుల విస్తరణలో అత్యంత కీలకమైనది పేరేచర్లకొండమోడు మార్గం. ఉమ్మడి గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు గ్రామం నుంచి గుంటూరుకు సమీపంలోని పేరేచర్ల వరకు ఉన్న 50 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణ పనులకు రూ.1032 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ ఎంపికైన తర్వాత ఎల్ఓఏ ఇచ్చే దశలో ఆగిపోయింది. గుంటూరు నుంచి హైదరాబాద్ మధ్య రాకపోకలకు సాగించేందుకు ఇది కీలకమైన రహదారి. ప్రస్తుతం ఈ రహదారి అత్యంత అధ్వాన్న పరిస్థితిలో ఉంది. దీంతో గుంటూరు, బాపట్ల, చీరాల, తెనాలి ప్రజలు కొంత దూరమైనా విజయవాడ వెళ్లి అక్కడినుంచి హైదరాబాద్ వెళుతున్నారు. విశాఖపట్నం కొత్తవలస అరకు మార్గంలో పెందుర్తి నుంచి బౌధార వరకు 42 కిలోమీటర్లను నాలుగు లైన్లుగా విస్తరించాల్సి ఉంది. ఇది టెండర్లు పిలిచిన తర్వాత ఆగిపోయింది.

# భయపెడుతున్న మూఢనమ్మకాలు

- క్షుద్ర పూజలతో ఉలిక్కి పడుతున్న ప్రజలు
- మూఢత్వానికి బలవుతున్న పలువురు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు



**విశ్వంభర, కాకినాడ:**

మనిషి సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతాలు చేస్తున్నాం. చంద్ర మండలంపై కాలు మోపాం. అక్కడ నివాస యోగ్యాలపై కూడా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో మూఢ నమ్మకాలు మనుషులను మరింత దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. మనిషిలో ఉండే భయాన్నే తమకు అనుకూలంగా చేసుకుని మూఢనమ్మకాలు వీరంగం చేస్తున్నాయి. దీంతో ప్రజలు నిరంతరం భయంతోనే కాలం గడుపుతున్నారు. ఇటీవల ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి. పల్నాడు జిల్లాలో గోడలకు మేకులు కొట్టిన సంఘటన గ్రామస్తులను కునుకు లేకుండా తాజాగా కాకినాడ జిల్లా తుని మండలంలోని లోవ కొత్తూరు గ్రామంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ఓ తోటలో జరిగిన క్షుద్ర పూజలు ఆందోళన కలిగించాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులను వాటిని అడ్డుకోవాలని చూడగా వారిపై కత్తులతో దాడి చేయాలని ప్రయత్నించారు. అంతేకాదు అక్కడ ఓ దూడన కూడా బలిచ్చారని సమాచారం. దీంతో ప్రజలు నిరంతరం జంకుతున్నారు. ఇలా మూఢనమ్మకాల కారణంగా చోటుచేసుకుంటున్న ఘటనలు అందరిలో ఆందోళన పెంచుతున్నాయి. మనిషి ఇంత పురోగమనంలో ఉన్నా ఇలాంటి మూఢనమ్మకాలు మరింత కుంగదీస్తున్నాయి. ఎక్కడకో వెళ్లాల్సిన మనుషులు అనవసర భయాలతో వెనక్కి వెళ్తున్నాడు. కంప్యూటర్ కాలంలో కూడా క్షుద్రపూజలు చేస్తున్నారనే నెపంతో ముందుకు వెళ్లడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్ లో కూడా మనిషి ముందుకు వెళ్లడం గగనమే. మూఢనమ్మకాల ముసుగులో మనం ఎదుగుదల ప్రశ్నార్థకంలో పడనుంది. దీనిపై అవగాహన కలిగించి మూఢ నమ్మకాలను తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించాలి.

## బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

**నిందితుడిని వదిలిపెట్టం.. హోంమంత్రి అనిత**



**విశ్వంభర, విశాఖపట్నం:** కొప్పుగుండుపాలెంలో బాలిక హత్యపై హోం మంత్రి వంగలపూడి అనిత సీరియర్ అయ్యారు. ఈ ఘటన దురదృష్టకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగినట్లు హోంమంత్రి అనిత చెప్పారు. పరారీలో ఉన్న నిందితుణ్ని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని అనిత అన్నారు. ఈ కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చీరాల ఘటనలో నిందితుణ్ని 36గంటల్లోనే పట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని చెప్పారు.

**అసలేం జరిగిందంటే..?**

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో ఓ బాలిక 9వ తరగతి చదువుతోంది. సురేశ్ అనే యువకుడు ప్రేమ పేరుతో రోజూ ఆమె వెంట పడేవాడు. ఇష్టం లేని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో నిందితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు యువకుణ్ని అరెస్టు చేశారు. బెయిల్‌పై వచ్చిన సురేశ్ బాలికపై కక్ష పెంచుకున్నాడు. ఎవరూ లేని సమయం చూసి బాలిక ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు.. ఆమెతో గొడవకు దిగాడు. అనంతరం ఇంట్లో ఉన్న కత్తితో ఆమె గొంతు కోశాడు. కేకలు విన్న బాలిక నాన్నమ్మ చుట్టుపక్కల వారిని పిలిచింది. ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులో చిన్నారి పడి ఉంది. స్థానికులు వచ్చేలోపే నిందితుడు సురేశ్ పరారయ్యాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై హోంమంత్రి అనిత సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరారీలో ఉన్న సురేశ్‌ను పట్టుకోవాలంటూ పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు.

## ఆమనగల్ ఎస్ఐగా వెంకటేష్



**విశ్వంభర, అమనగల్లు:** ఆమనగల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి.వెంకటేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శ్రీనివాసులు పది రోజుల్లోనే ఆర్‌జిఐఏ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న బి.వెంకటేష్ బదిలీపై ఆమనగల్‌కు వచ్చారు. ఈయన గతంలో తలకొండపల్లి ఎస్సైగా పనిచేశారు.

## ఇద్దరు ఎస్ఐలకు కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)జూలై 07 :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన ఎస్సై పాండుకు మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆదివారం వరకు మండలంలో విధులు నిర్వహించిన ఎస్ఐ తేజంరెడ్డికి వీడ్కోలు తెలిపారు. ఇద్దరు ఎస్ఐలను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాపల్లి మహేందర్, ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు లిమినేటి జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు పైళ్ల మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పైళ్ల విఠల్ రెడ్డి, సామా ఇంద్రారెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన షాద్ నగర్ నాయకులు



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టడానికి చెందిన పలువురు కాంగ్రెస్ యువ నాయకులు ఆదివారం కోమటి రెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వగృహంలో ఆయనను కలుసుకొని పుష్పగుచ్చాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం శాయశక్తుల కృషిచేసి ప్రభుత్వ ఏర్పాటుకు తనవంతు పాత్ర పోషించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డినీ ప్రత్యేకంగా కలుసుకోవడం జరిగిందని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ముబారక్ అలీ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఫరూక్ నగర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్ రాథోడ్, దొంతికుంట తండా గ్రామ అధ్యక్షులు ప్రశాంత్ రాథోడ్ తదితరులు మంత్రి కోమటిరెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

## ఉద్యమాలకు ఊపిరిపోసింది ఎమ్మార్పీఎస్ జెండానే..



**విశ్వంభర భూపాలపల్లి జూలై 7 :** మహాదేవ పూర్ మండలం మద్దుల పల్లి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భావ వేడుకలను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కోరల్ల బానయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు .ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద క్రిష్ణ 1994 జులై 7వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను 20మందితో మొదలు పెట్టి ఎన్నో ఉద్యమాలకు ఊపిరిపోసి లక్షల మందికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాలకు న్యాయం జరిగేలా ఉద్యమాలు చేసినా నాయకుడని అన్నారు. మందక్రిష్ణ ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటలని చూసి పక్క రాష్ట్రాలు అయిన తమిళనాడు ,మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మాదిగ పోరాట సమితిలు ఏర్పర్చుకున్నారని గుర్తు చేశారు. ఇదే రోజు మంద క్రిష్ణ పుట్టినరోజు కావడంతో ఎమ్మార్పీఎస్ నాయకులకు ఒక పండగలా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరుకుంటు స్వీట్స్ పంచిపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డా శంకర్ , కోరల్ల సురేందర్ , ప్రభాకర్, చకినారపు సమ్మరాజు , రవి, బాపు, నరేష్ , క్రిస్టయ్య, పూతల దుర్గయ్య, శ్యామ్, జగన్ , సదువలి , పోతుల సంపత్ , వేల్పుల సురేష్ పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో అనుమానితులను వేలిముద్రలను చెకింగ్

**విశ్వంభర భూపాలపల్లి జూలై 7 :** కాళేశ్వరం మండల కేంద్రంలో టీఎస్ఎస్‌పీ ఫోర్సు ఆధ్వర్యంలో ఎస్సై చక్రపాణి, ఏఎస్ఐ రాజేశం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆదివారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానితులను వేలిముద్రలను చెక్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై చక్రపాణి మాట్లాడుతే ప్రతిరోజు బస్టాండ్, షాపింగ్ ఏరియాలు, దేవాలయ చుట్టుపక్కల నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. లారీ డ్రైవర్లు ప్రజలను ఇబ్బందులను గురి చేయొద్దని, వాహనాల పార్కింగ్ క్రమబద్ధంగా పెట్టుకోవాలని సూచించారు. అనంతరం అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేసి అనుమానితులను విచారించారు. తప్పకుండా హెల్మెట్ ధరించాలని వాహనదారులను హెచ్చరించారు . కాళేశ్వరంలో సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.



# పాలస్తీనాను విచ్ఛిన్నం చేస్తుంటే మోడీ స్పందించరా?




- ప్రధాని మోడీ, బీజేపీ హిట్లర్ మూసలో పని చేస్తున్నారు
- పాలకులకు లౌక్యంగా ఉంటే కోదండరామ్‌కు మంత్రి పదవి వచ్చేది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఇందిరాపార్కు దగ్గర ధర్నా
- దేశ భవిష్యత్తు నేలమట్టమవుతోంది : ప్రొఫెసర్ కోదండరామ్

**విశ్వంభర, హైదరాబాద్:** పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నామని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా అఖిల భారత శాంతి సంఘీభవ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "పాలస్తీనాకు మద్దతుగా నిలబడదాం ప్రపంచ శాంతికి పోరాడుదాం"అనే అంశంపై హైదరాబాద్,ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆదివారం ధర్నా జరిగింది. ఈ ధర్నా ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ అందరూ మాకెందుకులే అనుకుంటే ప్రపంచంలో ఈ మేరకు శాంతి కూడా ఉండేది కాదన్నారు. భారతదేశం తరహాలో ఇతర దేశాల్లోనూ పాలస్తీనా, ఇజ్రాయిల్ అంశంపై స్పందించాలన్నారు. మన లాంటి దేశాల్లో వారి సొంత ప్రాంతాలను వదిలి బతుకుదెరువు కోసం వస్తే ఊళ్లు ఊళ్లు తిప్పుతున్నారన్నారు. దీంతో వారికి రేషన్ కార్డు, మంచినీళ్లు ఇవ్వడం లేదన్నారు. చివరికి కరెంటు కూడా ఇవ్వమంటున్నారని కూనంనేని తెలిపారు. దేశాన్ని పరిపాలిస్తున్న పాలకులు (బిజెపి) ఈరోజు పాలస్తీనాను విచ్ఛిన్నం చేస్తుంటే స్పందించడం లేదన్నారు. దేశ ప్రధాని మోడీ, బీజేపీ హిట్లర్ మూసలో ఉన్నారన్నారు. ఆయనలో ప్రపంచంలో ఏ మనిషి అయినా మన లాంటి వాళ్లేనని, మనలో ప్రవహించే రక్తంలోని గ్రూపులు ఒకటేనని గుర్తు చేశారు. ఈ బుద్ధి జ్ఞానం అమెరికా పాలకులకు, ఇండియాలో నరేంద్రమోడీకి ఎప్పుడు వస్తుందో అర్థం కావడం లేదన్నారు. పాలకులకు లౌక్యంగా ఉంటే గత బిఆర్ పాలనలో కోదండరామ్ కీలక మంత్రి పదవీ వచ్చేదని, అయితే సంపదను సృష్టించుకునే పాలకులు ఆయన్ను దగ్గరికి రానివ్వలేదన్నారు. కోదండరామ్, ప్రొఫెసర్ హర గోపాల్ లాంటి వారి సూచనలు , సారాంశం గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఒక కలంలోని శిరా చుక్క...లక్షల మెదళ్లకు కదలిక మాదిరిగా ఈ కార్యక్రమం అన్ని చోట్లకు పోవాలన్నారు.

**శాంతి ఉద్యమ కారులు స్పందించాలి**

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గాజా పట్టీలో వేలాది మంది పౌరులను చట్టవిరుద్ధంగా చంపడం, వేలాది మందిని స్థానభ్రంశం చేయడం , గృహాలు, వ్యాపారాలు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు చేస్తుందని తెలిపారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మట్లాడుతూ పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడులు చేయడాన్ని ఆప్ పార్టీ ఖండిస్తోందన్నారు. శాంతి ఉద్యమ కారులు కూడా స్పందించి పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలన్నారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ మాజీ ఎంఎల్ఏ యాదవ రెడ్డి అధ్యక్షత వహించగా ఆప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ స్వాగతం పలికారు. అతిథులుగా మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి , ఐప్సో అధ్యక్ష వర్గం సభ్యులు రఘుపాల్ , ప్రజా కళాకారిణి విమలక్క తదితరులు వేదికపై ఆశీనులై ప్రసంగించారు. ఈ ధర్నాలో ఐప్సో నేతలు రఘుపాల్, ఎంఏ మాజీద్, అప్సాబేగం ,నాగేందర్ ప్రసాద్, రవి కిరణ్, ఉమా మహేశ్, ప్రేమ్ పావని, రామరాజు, యమునా గౌడ్ , గురుబచనం సింగ్, లాక్షా నాయుడు , సిపిఎం నేత జెకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**దేశ భవిష్యత్తు నేలమట్టమవుతోంది: ప్రొఫెసర్ కోదండరామ్**

పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకపక్షంగా చేస్తున్నటువంటి దాడుల ఫలితంగా పాలస్తీనాలోని విద్యార్థులు, యువకులు, నాగరికత దేశ భవిష్యత్తు మొత్తం నేలమట్టమవుతోందని ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా హాజరైన టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా గత కొన్ని దశాబ్దాలుగా తమ దేశాన్ని స్వతంత్ర్య దేశంగా ప్రకటించాలని పోరాడుతున్నదని, ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితి మధ్యే మార్గంగా కొన్ని తీర్మానాలు చేసినప్పటికీ ఇజ్రాయిల్ వాటిని అమలు చేయక పోగా పాలస్తీనా మీద పాఠశాలలు , దవాఖానాల మీద బాంబుల వర్షం కురిపిస్తోందని ఇది చాలా బాధకరమన్నారు.

## ఎస్ఐ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- పోలీసు శాఖలో కులవివక్షపై సీఎం స్పందించాలి
- ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేయాలి
- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్



**విశ్వంభర, సూర్యాపేట:** చట్టాలు అమలు చేసే స్థానాల్లో ఉన్న పోలీసు శాఖలో కుల వివక్ష వేధింపులు ఉండటం వల్లే దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పందించి సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేటలోని ఎం.వి.ఎన్ భవన్ లో జరిగిన ప్రెస్మీట్ లో ఆయన మాట్లాడుతూ అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ 25 రోజుల కిందటనే తను ఎదుర్కొన్న వివక్ష వేధింపులపై జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే దళిత ఎస్సై ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. సీఐ జితేందర్ రెడ్డి కానిస్టేబుళ్లు కొందరు వేధించిన తీరు వల్లే మన స్తాపానికి లోనయ్యి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ సంఘటన పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలన్నారు. పోలీసు శాఖలో జరుగుతున్న కుల వివక్ష,వేధింపులపై ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్టాలు అమలు చేసే స్థానాల్లో ఉన్న పోలీసుల శాఖలోనే కుల వివక్ష కొనసాగితే గ్రామ సీమల్లో సాధారణ దళితుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో రోజురోజుకీ దళితుల పైన దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు.ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ప్రెస్మీట్ లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మర్రి నాగేశ్వరరావు, జిల్లానాయకులు సైదులు, సుధాకర్,నాగమణీ,దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

**విశ్వంభర, సూర్యాపేట:** బాలెంల గురుకుల డిగ్రీ కళాశాలను అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చుతున్న బాలెంల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శైలజను వెంటనే సస్పెండ్ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. గురుకుల కళాశాలలో చదివే విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషిస్తూ,వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, బూతులు తిడుతు ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోకపోవడం సరైనది కాదన్నారు. విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రిన్సిపాల్ తన గదిని బార్ రూమ్ గా మార్చిందని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శైలజ వేధింపులు తట్టుకోలేక ఆందోళన గురి చేస్తున్న విద్యార్థుల సమస్యకు తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పరిష్కారం చూపాలని అన్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, కళాశాలలో లభ్యమైన బీరు బాటిల్లపై సమగ్ర విచారణ జరిపి ప్రిన్సిపాల్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా,రాష్ట్ర అధికారులు ఘటనలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా విచారణ జరిపి నివేదికలు సమర్పిస్తున్నామని చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. విద్యార్థులలో అవేర్నెస్ తీసుకొచ్చే కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.






## గౌడులకు సహాయం చేసేందుకే తెలంగాణ గౌడ సమితి ఆవిర్భావం

- 15 రోజుల్లో జిల్లాలు, మండలాల కమిటీని వేస్తాం
- రాష్ట్ర అధ్యక్షుడు తోలుపునూరి రమేష్ గౌడ్
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం గౌడ ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, నారాయణగూడ:** ప్రతి జిల్లాలో ఉన్న గౌడులకు సహాయం చేసే ఉద్దేశంతోనే తెలంగాణ గౌడ సమితిని ఏర్పాటు చేసినట్టు ఆ సమితి వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు తోలుపునూరి రమేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో సోహైల్ మినీ హాల్ లో గౌడ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మండలాల నుంచి గౌడ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తోలుపునూరి రమేష్ గౌడ్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్, గోల్కొండ కోటపై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించడంతోపాటు 15 రోజుల్లో జిల్లాలు, మండలాల వారిగా గ్రామాల్లో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ గౌడ సేవా సమితి ఆధ్వర్యంలో మారెన్నో సేవా కార్యక్రమాల చేసేందుకు తెలంగాణ గౌడ సేవా సమితి ముందుంటుందని కమిటీ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బొల్గం నరేష్ గౌడ్, సి .అరవింద్ గౌడ్, ఈ.రాజుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, జంగయ్యగౌడ్, నాగార్జునగౌడ్, సత్యంగౌడ్, బాల్ రాజ్ గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

## రేపటి భవిష్యత్తు ఆధ్యాత్మికంతోనే ముడిపడి ఉంది

**రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మారుతీ కిరణ్**

**విశ్వంభర, కుల్కచర్ల :** మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో నూతనంగా



నిర్మిస్తున్న శివాలయాన్ని, గోశాలను ఆదివారం రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మారుతీ కిరణ్ సందర్శించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అతనిని శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఘనపూర్ గ్రామంలో గల శివాలయం భవిష్యత్తులో ఒక ఆధ్యాత్మిక క్షేత్రంగా మారబోతుందని అన్నారు. భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే సంస్కృతి సాంప్రదాయాలు క్షేత్రాలే అని రేపటి భవిష్యత్తు ఆధ్యాత్మికంతోనే ముడిపడి ఉందని, హిందువులు ప్రతి ఒక్కరు గుడి యొక్క ప్రాధాన్యతను పిల్లలకు తెలియజేయాలని తెలిపారు. ఆలయ నిర్మాణాలకు, గోశాలలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ బిజెపి ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, పి ఎస్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు, దోమ మండల ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు నర్సింలు, బిజెపి యువ నాయకులు నర్సింలు, శ్రీరామ్, హరి, అజయ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెండితెర మేఘమైతే.. దానిపై మెరిసిన మెరుపు తీగ పాయల్ రాజ్‌పుత్. 'ఆర్ఎక్స్ 100'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి కుర్రాళ్ల గుండెల్లో గుబులు రేపింది. మొదటి చిత్రంతో హాట్ బ్యూటీగా గుర్తింపు పొందిన ఆమె వరుస అవకాశాలతో దూసుకుపోయింది. కానీ, కొందరు పనిగట్టుకొని తనను తప్పుదోవ పట్టించడంతో మోసపోయానని చెబుతున్నది పాయల్. ఇటీవల 'మంగళవారం' హిట్‌తో మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చిన ఈ నటి తాజాగా 'రక్షణ' సినిమాతో మరోసారి ప్రేక్షకులకు అందాల విందు చేయనుంది. హిట్ హీరోయిన్‌గా పేరొచ్చినా.. కెరీర్‌లో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్న ఈ హాట్ హీరోయిన్ పంచుకున్న కబుర్లు ఇవి. కథ డిమాండ్ చేస్తే బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. 'ఆర్ఎక్స్ 100' కథలో భాగంగానే శృంగార సన్నివేశాలు ఉన్నాయి. కానీ, కథలో లేకున్నా.. అనవసరంగా అలాంటి సన్నివేశాలు జొప్పిస్తే మాత్రం ఒప్పుకోను. కెరీర్ మొదట్లో పంజాబీ టెలీ సీరియల్స్, సినిమాల్లో నటించాను. మరాఠీలో ఘనవిజయం సాధించిన 'సైరత్' చిత్రం పంజాబీ రీమేక్ నాకు మంచి గుర్తింపునిచ్చింది. ఆ చిత్రంలో నా నటనకు ఫిలింఫేర్ అవార్డు లభించింది. ఇక టాలీవుడ్‌లో 'ఆర్ఎక్స్ 100' సాధించిన సక్సెస్ నాకు వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. ఇలియానా, అనుష్కశెట్టి అంటే ఇష్టం. పవన్‌కళ్యాణ్ చిత్రాలు ఎక్కువగా చూస్తాను. అవకాశం వస్తే మహేశ్‌బాబు, ప్రభాస్ సినిమాల్లో చేయాలని ఉంది. ప్రభాస్ నా ఫేవరెట్. ఆయనకు లంచ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నా. తను ఏది అడిగితే అది చేసిపెట్టాలని నా కోరిక. రాజ్మా రైస్ నాకు నాకు చాలా ఇష్టం. దాన్ని నేనే స్పెషల్‌గా వండి నా చేత్తో ప్రభాస్‌కు తినిపించాలని ఉంది. అలాంటి చాన్స్ వస్తే మాత్రం అస్సలు వదులుకోను.

నేను ఎలాంటి పాత్రలు పోషించాలన్నది ప్రధానం కాదు. స్క్రిప్టులో బలం ఉండాలి. కథ లేకుండా, ఎలాంటి పాత్ర చేసినా ఫలితం శూన్యమే. ముందుగా కథ, నా పాత్ర నచ్చాలి. డైరెక్టర్ మంచివాడై ఉండాలి. అలాంటి సినిమాలే ఒప్పుకొంటాను. బలమైన కథతో రూపొందే హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించాలని ఉంది. కథ నచ్చితే రెమ్యునరేషన్ గురించి పెద్దగా పట్టించుకోను. నేను ఏ పనిచేసినా 200 శాతం ఎఫర్ట్స్ పెడతాను. అయితే ఒక్కోసారి మనం ఆశించిన ఫలితం రాకపోవచ్చు. అది డెస్టినీ అనుకుంటాను. 'ఆర్ఎక్స్ 100' సక్సెస్‌ను నేను సద్వినియోగం చేసుకోలేదనే చెప్పాలి. ఆ టైమ్‌లో చాలామంది నన్ను మిస్‌లీడ్ చేశారు. ఇప్పుడు తత్వం బోధపడింది. ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడికి వెళ్లకూడదు, ఏం చేయాలి, ఏం చేయకూడదు లాంటి విషయాలు తెలిసొచ్చాయి. ఇప్పుడు ఏదైనా ప్రాజెక్టు ఓకే చేయడానికి ముందు ఇవన్నీ ఆలోచిస్తాను. నా జాగ్రత్తలో నేనుంటాను.

# ప్రభాస్ కోసం ఏదైనా చేస్తా



# బాయ్ ఫ్రెండ్ కావాలట ముద్దుగుమ్మకు

ప్రేమ, పెళ్లి, విడాకులు.. ఇప్పుడు సినీ పరిశ్రమలో సర్వసాధారణమయ్యాయి. సంవత్సరాల లవ్ స్టోరీస్.. క్షణకాలంలో విడిపోతున్నాయి.. ఇక పాతికేళ్ల వైవాహిక బంధాలకు కూడా గ్యారెంటీ లేకుండా పోయింది. ఎప్పుడూ ఎవరు డివోర్స్ కూడా ప్రకటిస్తారో అనేది తెలియడం లేదు. అయితే ఒకప్పుడు టాప్ హీరోయిన్ గా సత్తా చాటిన నటి.. పాన్ ఇండియాలోనే అగ్రస్థానంలో కొనసాగిన కథానాయిక జీవితం మాత్రం చాలా విభిన్నం. ఇప్పటివరకు మొత్తం 12 మందిని ప్రేమాయణం నడిపింది. కానీ అవేవి ఎక్కువ కాలం నిలవలేదు. ప్రేమ మాత్రమే కాదు.. పెళ్లి కూడా కొనసాగలేదు. పెళ్లి చేసుకున్న కొన్నాళ్లకే భర్తతో విడిపోయింది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో అగ్ర హీరోల సరసన ఎన్నో



సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. కానీ జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ప్రస్తుతం ఆమె వయసు 53 సంవత్సరాలు. ఇప్పటికీ తనకు సరైన వ్యక్తిని జీవితంలోకి ఆహ్వానించేందుకు రెడీగా ఉన్నానని అంటోంది. ఆమె ఎవరో తెలుసా..? అలనాటి హీరోయిన్ మనీషా కోయిరాలా. 90వ దశకంలో సినీ పరిశ్రమలో తనదైన గుర్తింపు వేసింది. సినీరంగుల ప్రపంచంలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో అగ్రకథానాయికగా ఓ వెలుగు వెలిగింది. బాబా, ముంబయి, డియర్ మాయ, లస్ట్ స్టోరీ, సంజు, ప్రస్థానం, షెహజాదా వంటి హిట్ చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత వయసు పెరుగుతున్నకొద్ది అవకాశాలు తగ్గిపోయాయి. సినిమాలకు దూరమైన సమయంలోనే క్యాన్సర్ భారిన పడింది. ఈ సమస్యకు చికిత్స తీసుకున్న మనీషా.. క్యాన్సర్ నుంచి కోలుకుని తిరిగి సినిమాలపై దృష్టి పెట్టింది. ఇటీవలే డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన హీరామండి వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీ సినీ ప్రియుల ముందుకు వచ్చింది. ఇదిలా ఉంటే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మనీషా.. తన లైఫ్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఫిలింఫేర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మనీషా మాట్లాడుతూ.. "నేను తప్పుడు పురుషులను మాత్రమే ప్రేమించాను. ఒక్కసారి కాదు. మళ్లీ మళ్లీ అదే తప్పు చేశాను. నేను ఎందుకు ఇలా చేశాను అని ఆలోచించాను. తప్పులు చేసిన వ్యక్తులను మాత్రమే నేను ప్రేమించాను. ఆ తర్వాత నా తప్పును గ్రహించాను. ఇకపై అలాంటి మిస్టేక్ చేయకూడదని అనుకున్నాను. నేను గత ఆరేళ్లుగా ఒంటరిగా ఉంటున్నాను. ప్రస్తుతం మరొకరిని ప్రేమించడం.. లేదా ఎవరితోనైనా బంధాన్ని కలుపుకునే మానసిక స్థితిలో మాత్రం లేను. చెడు సంబంధాలలో ఉన్నప్పటికీ నేనెప్పుడు ప్రేమపై నమ్మకం కోల్పోలేదు. నన్ను అర్థం చేసుకునే.. నాతో నిజాయితీగా ఉండే భాగస్వామిని ఇప్పటికీ నేను కనుగొంటాను. నేను చాలా ఎమోషనల్ పర్సన్. కలలు, ఆశయాలు, అభిరుచి ఉన్నవారితో కలిసి ఉండాలనుకుంటున్నాను" అంటూ చెప్పుకొచ్చింది.

# ప్రియాంక ఫస్ట్ లుక్ అదుర్స్

స్టార్ హీరో నాని నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి విడుదల చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే నేడు మూవీ నుంచి ప్రియాంక అరుళ్ మోహన్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీలో ప్రియాంక మోహన్ లేడి పోలీస్ చారులత పాత్రలో నటిస్తున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతుంది.యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రంలో సాయికుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక 'అంటే సుందరానికి' (Ante Sundharaniki) సినిమా తర్వాత నాని - వివేక్ కాంబో రిపీట్ అవుతుండడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఇంట్రెస్టింగ్ గా డార్లింగ్ సినిమా ట్రైలర్

టాలీవుడ్ యువ నటుడు ప్రియదర్శి, నభా నటేష్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'డార్లింగ్'. ఈ సినిమాకు అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తుండగా.. హనుమాన్ సినిమాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సినిమాను జూలై 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. విడుదల తేదీ దగ్గర పడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను మేకర్స్



విడుదల చేశారు. పెళ్లి చేసుకొని పారిస్‌కి హనీమూన్‌కు వెళ్లాలని గోల్ పెట్టుకున్న యువకుడు ఒక యువతిని పెళ్లి చేసుకోగా ఆ యువతికి స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ (అపరిచితుడు మూవీలో విక్రమ్ లాగా) ఉంటుంది. అయితే స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ ఉన్న అమ్మాయిన చేసుకున్న అతడు భార్య చేతిలో కీలు బొమ్మగా ఎలా మారాడు. చివరికి ఏం అయ్యింది అనేది సినిమా స్టోరీ. పెళ్లి చూపులు, కీడకోలా ఫేమ్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో అనన్య నాగళ్ల, మోయిన్, శివా రెడ్డి, మురళీధర్ గౌడ్, కళ్యాణి రాజ్, సునీత మనోహర్, ముళ్లపూడి రాజేశ్వరి, అభిజ్ఞ, జీవన్, కృష్ణతేజ, విష్ణు, సంజయ్ స్వరూప్, రఘుబాబు, ప్రియాంక, స్వప్నిక, శివరంజని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# జైహనుమాన్ లో హనుమంతుడిగా రామ్ చరణ్..




ఈ ఏడాది హనుమాన్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ ప్రశాంత్‌వర్మ. తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించడమే కాకుండా వరల్డ్‌వైడ్‌గా రూ.250 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. 'జై హనుమాన్' అంటూ ఈ సినిమా రానుండగా.. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది ఈ చిత్రం. అయితే ఈ సినిమాలో హనుమంతుడిగా కనిపించబోయేది ఎవరంటూ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాలో మొదట హనుమంతుడిగా టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి కనిపించబోతున్నట్లు.. ఆ తర్వాత బాలీవుడ్ స్టార్ హీరో కనిపించబోతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హనుమాన్ నిర్మాత చైతన్యరెడ్డి హనుమాన్ పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డితో కలిసి ఆమె నిర్మించిన చిత్రం 'డార్లింగ్'. అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా చైతన్యరెడ్డి విలేకరులతో ముచ్చటించారు. డార్లింగ్ మూవీతో పాటు హనుమాన్ సినిమాపై రిపోర్టర్‌లు ప్రశ్నలు అడుగగా.. ఆమె సమాధానమిస్తూ.. జై హనుమాన్ సినిమాలో హనుమంతుడి పాత్ర ఎవరు నటిస్తారనే విషయం మీద పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. మా జర్నీని మొదలుపెట్టించింది హనుమానే, ఆయన వల్లే ముందుకు వెళ్తున్నామని చైతన్యరెడ్డి అన్నారు. ఆయన తన పాత్రలో ఏ హీరోని చూడాలనుకుంటే ఆ హీరోతోనే సినిమా జరుగుతుంది అయితే నా పర్సనల్ ఫస్ట్ ప్రిఫరెన్స్ మాత్రం రామ్ చరణ్ కి ఉంటుంది లేదా ఆయన తండ్రి చిరంజీవి నటించిన బాగుంటుందని ఆమె అన్నారు. ఇప్పుడే 'జై హనుమాన్' ప్రీప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ అయ్యింది. 'హనుమాన్'ని మించేలా ఈ సినిమా ఉంటుంది. ఇందులో హనుమంతుడి పాత్ర ఎవరు చేస్తారనేది ఆ హనుమంతుడే డిసైడ్ చేస్తారు' అని చైతన్యరెడ్డి చెప్పారు.

# కప్పు కాఫీ రూ.6000



**విశ్వంభర, ఫీచర్ :** ఒక కప్పు కాఫీకి 6000 రూపాయలు, ఆశ్చర్యంగా ఉందా? దీన్ని తయారు చేసిన విధానం మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. కోపి లువాక్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ. జంతువుల పేడతో తయారు చేస్తారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ అయిన లువాక్ మలంతో తయారు చేయబడింది. అంటే, ఈ కాఫీ పౌడర్ సగం జీర్ణమయ్యే కాఫీ గింజల నుండి తయారవుతుంది, వీటిని పిల్లి లాంటి జంతువు సివెట్ తిని విసర్జిస్తుంది. ఈ కాఫీ ఇండోనేషియా నుండి ఉద్భవించింది, ముఖ్యంగా సుమత్రా, జావా మరియు సులవేసి దీవులు, కోపి లుయాక్ అని పిలువబడే కాఫీ దాని ప్రత్యేకత కోసం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ కాఫీ చాలా ఖరీదైనది కావడానికి మరొక కారణం దాని ప్రత్యేక ఉత్పత్తి. దీని మూలం ఇండోనేషియా పామ్ సివెట్ యొక్క జంతువుల పేడ. అంటే పామ్ సివెట్ తిన్న పాక్షికంగా జీర్ణమై బహిష్కరించబడిన కాఫీ గింజల నుండి ఈ కాఫీ ఉత్పత్తి అవుతుంది. ఈ కాఫీని ఉత్పత్తి చేసే సాంప్రదాయ పద్ధతుల కారణంగా ధర ఎక్కువగా ఉంటుంది. ఈ ఉత్పత్తి చాలా సమయం మరియు శక్తిని తీసుకుంటుంది. ఆగ్నేయాసియాలో కనిపించే ఆసియా పామ్ సివెట్స్, పండిన కాఫీ బెర్రీలను తింటాయి మరియు రైతులు తరచుగా అడవిలో ఈ రకమైన సరైన కాఫీ గింజలను కనుగొంటారు. జీర్ణక్రియ ప్రక్రియలో సంభవించే కిణ్వ ప్రక్రియ బీన్స్ యొక్క సువాసనను పెంచుతుంది, ఫలితంగా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ. వైల్డ్ కోపి లువాక్ ధర ఒక్కో కప్పుకు $20 మరియు $100 మధ్య హెచ్చుతగ్గులకు లోనవుతుంది మరియు పండించిన కోపి లువాక్ ధర కూడా $10 మరియు $50 మధ్య ఉంటుంది. ప్రపంచంలో కాఫీ ఉత్పత్తిలో భారతదేశం ఏడవ అతిపెద్దది. మన దేశం కూడా సివెట్ కాఫీని ఉత్పత్తి చేస్తుంది. బీన్స్ అరబికా మరియు రోబస్టా బ్లెండ్ సివెట్ కాఫీ కోపి లువాక్ భారతదేశంలో 1 కిలోకి దాదాపు 10000 రూపాయలు.

**లువాక్**

19వ శతాబ్దపు వలసరాజ్యాల కాలంలో, డచ్‌లు ఇండోనేషియా స్థానిక కార్మికులు తమ స్వంత కాఫీని పండించకుండా నిషేధించారు. ఆ సమయంలో, ఇండోనేషియాలోని స్థానిక రైతులు కాఫీ గింజలను సేకరించి ఈ విధంగా కాఫీని ఎలా తయారు చేయాలో కనుగొన్నారు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com